


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 213, పేజీలు - 08




గురువారం, జనవరి 15, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## పొంగలి వండిన ప్రధాని మోదీ

**- కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** సంక్రాంతి పండుగను ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకుంటున్నారు. భారతదేశం అంతటా ఈ పండుగను వివిధ పేర్లతో, రక రకాలుగా జరుపుకుంటున్నారు. ఉత్తర భారత దేశంలో 'మకర సంక్రాంతి' పేరుతో గంగా స్నానాలు, దానధర్మాలు నిర్వహిస్తుంటారు. పంజాబ్, హర్యానాలో 'లోహ్రి' పండుగను మంటలు వేసి, పాటలు పాడుతూ సెలబ్రేట్ చేస్తున్నారు. అస్సాంలో 'బిహు' పేరుతో కొత్త పంటను ఆహ్వానిస్తుండగా.. గుజరాత్‌లో 'ఉత్తరాయణ్ణ పేరిట ఆకాశమంతా గాలిపటాలతో నిండిపోయింది. పేరు ఏదైనా, దేశవ్యాప్తంగా రైతుల కష్టాన్ని గౌరవించడం, ప్రకృతిని ఆరాధించడం ఈ పండుగ ప్రధాన

2లో..

# సంక్షేమం సరిపోతుందా.. ప్రజాసమస్యలు పరిష్కరించవద్దా.?

## - ప్రభుత్వంపై ప్రజల్లో ఇదే అసలు అసంతృప్తి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ప్రస్తుతం సంక్షేమం వర్సెస్ అభివృద్ధి అనే అంశం హాట్ టాపిక్‌గా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఆరు గ్యారెంటీల అమలుకు పెద్దపీట వేసింది. 2025-26 బడ్జెట్‌లో ఏకంగా రూ. 56,000 కోట్లను కేవలం ఈ గ్యారెంటీల కోసమే కేటాయించడం ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తోంది. అయితే, ప్రజలను నేరుగా ఆకట్టుకునే నగదు బదిలీ, ఉచిత పథకాలపై పెడుతున్న దృష్టి, రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనపై తగ్గిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల మరమ్మతులు, మురుగునీటి పారుదల వంటి ప్రాథమిక పనులు కూడా నిధుల లేమితో అగిపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణం అవుతోంది.

### అభివృద్ధి పనులన్నీ ఎక్కడివక్కడే !

ముఖ్యంగా గతంలో ఆర్భాటంగా ప్రకటించి శంకుస్థాపనలు చేసిన పలు ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉదాహరణకు, ఎంఎంటీఎస్ రెండో దశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా ఇవ్వాల్సిన సుమారు రూ. 381 కోట్లు విడుదల చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు పట్టాలెక్కడం లేదు. అదేవిధంగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధుల బకాయిలు పెరిగిపోవడం వల్ల పనులు మందగించాయి. కేవలం రైల్వేలే కాకుండా, సాగునీటి రంగంలో అత్యంత కీలకమైన దేవాదుల వంటి ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా 2025 నాటికి పూర్తి కావాల్సిన గడువును దాటి 2027కు వాయిదా పడ్డాయి.

### కాంట్రాక్టర్లకు బకాయిలు - కొత్తప పనులు చేయడానికి ముందుకు రాని వైనం

ప్రభుత్వ వ్యూహం ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, పేదలకు తక్షణ ఊరటనివ్వడం చుట్టూ తిరుగుతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి వంటి పథకాలు లబ్ధిదారులకు మేలు చేస్తున్నా దీర్ఘకాలికంగా ఆదాయాన్ని సృష్టించే మౌలిక సదుపాయాల కల్పన అటకెక్కడం ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రభుత్వ కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో, కొత్త పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీనివల్ల గ్రామాలు, పట్టణాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయి, ప్రజలు రోజువారీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### భారీ ప్రాజెక్టులూ మాటలకే పరిమితం

ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్ వంటి భారీ ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భూసేకరణ సవాళ్లు, నిధుల సమీకరణ పెద్ద అడ్డంకులుగా మారాయి. ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం వంటి అత్యవసర ప్రాజెక్టుల విషయంలో శంకుస్థాపన చేసినా, అసలు పనులు ప్రారంభం కావడానికి నెలల తరబడి సమయం పడుతోంది. ఆరోగ్య, విద్యా రంగాల్లో మౌలిక

2లో..

# అమరావతి మాస్టర్ ప్లాన్ విస్తరణ

## - కొత్త హద్దులు, కీలక నిర్ణయాలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అమరావతి కేంద్రంగా కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి. రెండో విడత భూ సమీకరణ సమయం లోనే సీఆర్డీఏ కొత్త ప్రణాళికలు అమలు చేస్తోంది. షెడ్యూల్ ప్రకారం నిర్మాణాల ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఇదే సమయంలో రాజధాని మాస్టర్ ప్లాన్ విస్తరణ దిశగానూ ఆలోచన జరుగుతోంది. లాండ్ పూలింగ్ విస్తీర్ణం పెరగటంతో దీనికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ లో అవసరమని గుర్తించారు. దీంతో, కొత్త హద్దులు ఖరారు చేస్తూ మాస్టర్ ప్లాన్ విస్తరణ కోసం సీఆర్డీఏ ప్రతిపాదనలు సిద్దం చేస్తోందని సమాచారం. అమరావతిలో రెండో విడత లాండ్ పూలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందుకు అనుగుణంగా సీఆర్డీఏ రాజధానికి కొత్త హద్దుల మేరకు మాస్టర్ ప్లాన్ విస్తరణకు నిర్ణయించారని సమాచారం. ఈ మేరకు తుది కసరత్తు చేస్తున్నారు. రెండో విడత భూ సమీకరణ ప్రక్రియ

2లో..

## నారావారిపల్లెలో లోకేశ్ 81వ రోజు ప్రజాదర్బార్

**- పెద్దఎత్తున తరలివచ్చి వినతులు సమర్పించిన ప్రజలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ఐటీ, విద్య, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం 81వ రోజుకు చేరుకుంది. తిరుపతి జిల్లా చంద్రగిరి

2లో..

## మహిళలను అవమానించడం
# క్రూరత్వమే

## - దుష్ప్రచారం చేస్తే చర్యలు తప్పవు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రజా సంబంధిత, నేరాల గురించి అవగాహన కల్పించే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తాజాగా మరో అంశంపై స్పందించారు. మహిళల వ్యక్తిత్వంపై దాడి చేయడం క్రూరత్వమని, వారి గురించి దుష్ప్రచారం చేయడం నేరమన్నారు. మహిళలపై దుష్ప్రచారం, దాడులు చేయడమంటే వారి పురోగతిని అడ్డుకోవడమేనని అన్నారు.

### హైదరాబాద్ సీపీ సజ్జనార్ ట్వీట్ వైరల్

ప్రజా జీవితంలో విమర్శలు సహజమేనని. రాజకీయాలైనా, సామాజిక అంశాలైనా భిన్నాభిప్రాయాలు ఉండటం ప్రజాస్వామ్య లక్షణం అన్నారు సజ్జనార్. కానీ

2లో..

# కొత్త సర్పంచ్‌లకు శిక్షణ

## - విడతల వారీగా తరగతులు - 24 అంశాలపై పాఠాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గతేడాది ఏడాది డిసెంబర్‌లో తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు గాను, కాంగ్రెస్ 7,010 స్థానాల్లో గెలిచి అగ్రస్థానంలో నిలిచింది. ఇక బీఆర్ఎస్ మద్దతుదారులు మొత్తం 3,502 స్థానాలను గెలుచుకోగా, బీజేపీ 688 స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నూతన గ్రామ పంచాయతీల పాలవర్గాలకు ఐదు రోజుల పాట జిల్లా కేంద్రాల్లో ట్రైనింగ్ ఇచ్చేల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2లో..



## నోటీసులు ఇస్తే సరిపోతుంది కదా..
# ఇంత దౌర్జన్యం ఎందుకు.?

**- జర్నలిస్టుల అరెస్టుపై భగ్గుమన్న బీఆర్ఎస్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ముగ్గురు జర్నలిస్టులను పోలీసులు అపహరించారని ఆరోపిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆయన ఘాటుగా స్పందించారు. "మీరు నడుపుతున్న 'మొహబ్బత్ కీ దుకాన్ణ తెలంగాణ శాఖ, పౌరుల రాజ్యాంగ హక్కులను ఎలా కాలరాస్తోందో గమనిస్తున్నారని ఆశిస్తున్నా" అని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మంగళవారం రాత్రి రాష్ట్ర

2లో..

## శబరిమలలో మకరజ్యోతి దర్శనం

2లో..

**- పులకించిన భక్తజనం**



# ములుగు జిల్లా రద్దు
## వదంతులు నమ్మొద్దు

**- మంత్రి సీతక్క క్లారిటీ**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జిల్లాల పునర్విభజన చేపడతామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఈ జిల్లాలను ఏర్పాటు చేసిందని, రాబోయే రోజుల్లో హేతుబద్ధంగా పునర్విభజన చేపడతామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. దీనికోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో త్వరలో జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో పలు జిల్లాలు రద్దు అవుతాయని విస్తృతంగా ప్రచారం

2లో..






# పొంగలి వండిన ప్రధాని మోదీ

ఉద్దేశంగా చెప్పొచ్చు. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు 'భోగి' పండుగతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే ఢిల్లీలోని కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ నివాసంలో నిర్వహించిన సంప్రదాయబద్ధమైన పొంగల్ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు, ముఖ్యంగా తమిళ ప్రజలకు పొంగల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు తనదైన శైలిలో గౌరవం తెలియజేస్తూ, ప్రధాని స్వయంగా గోవులకు పూజలు నిర్వహించి, పొంగలి వండి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

### కేంద్ర మంత్రులు, ప్రముఖుల హాజరు

ఈ పొంగల్ వేడుకల్లో కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు సహా పలువురు ఎంపీలు, ప్రముఖ నేతలు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. సంప్రదాయ వేషధారణ, తమిళ సాంస్కృతిక వాతావరణం ఈ వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. దేశ రాజధానిలో తమిళ సంస్కృతి ఘనంగా ఆవిష్కృతమవడం అందరి దృష్టిని ఆకర్షించింది. దేశ అభివృద్ధిలో రైతులు అత్యంత కీలక భాగస్వాములని ప్రధాని పునరుద్ఘాటించారు. రైతులను ఆర్థికంగా, సాంకేతికంగా శక్తిమంతం చేయడమే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతి, వ్యవసాయం విడదీయరాని బంధమని పేర్కొంటూ, పొంగల్ వంటి పండుగలు రైతుల కష్టానికి గౌరవ సూచకంగా నిలుస్తాయని మోదీ వ్యాఖ్యానించారు.వేడుకల అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. గత ఏడాది తాను తమిళనాడులో పాల్గొన్న పలు కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన గంగైకొండ చోళపురం ఆలయం, అలాగే దేశానికి గర్వకారణమైన పంబన్ వంతెన ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా తమిళుల గొప్ప చరిత్ర, వారసత్వాన్ని మరింత లోతుగా తెలుసుకునే అవకాశం కలిగిందని ఆయన తెలిపారు. కొన్ని నెలల క్రితం తమిళనాడులో నిర్వహించిన సహజ వ్యవసాయ సదస్సుకు తాను హాజరయ్యానని తెలిపారు. మంచి ఉద్యోగాలు, లాభదాయక వృత్తులను వదిలి వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టిన యువతను కలవడం తనకు ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. వారి కృషిని మరింత విస్తరించి, వ్యవసాయంలో కొత్త విప్లవం తీసుకురావాలనే సంకల్పం తనకు కలిగిందని చెప్పారు. వ్యవసాయాన్ని స్థిరంగా, పర్యావరణ అనుకూలంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో నీటి నిర్వహణ, సహజ వ్యవసాయం, ఆధునిక సాంకేతికతలు, డిజిటల్ సొల్యూషన్లు రైతులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. దీంతో పాటు రైతుల ఆదాయం పెంపు, ఖర్చుల తగ్గింపు దిశగా విధానాలు అమలు చేస్తున్నామని వివరించారు.

## సంక్షేమం సరిపోతుందా..
# ప్రజాసమస్యలు పరిష్కరించవద్దా.?

వసతుల లేమిపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆరు గ్యారెంటీల అమలు కోసం చేస్తున్న అప్పులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే అవకాశం ఉండటంతో, భవిష్యత్తులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం మరింత కష్టతరం కానుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.కేవలం సంక్షేమ పథకాలతోనే ఓటర్లను మెప్పించవచ్చని భావించడం ప్రభుత్వానికి రాజకీయంగా రిస్క్ తో కూడుకున్న వ్యవహారమే. ఎందుకంటే, ప్రజలు పథకాలతో పాటు మెరుగైన రోడ్లు, సాగునీరు, మౌలిక సదుపాయాలను కూడా కోరుకుంటారు. నిధులన్నీ పథకాలకే మళ్లిస్తూ, కంటికి కనిపించే అభివృద్ధిని విస్మరించడం వల్ల మధ్యతరగతి, పట్టణ ఓటర్లలో వ్యతిరేకత మొదలవుతోంది. సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సరైన సమతుల్యత పాటించకపోతే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమరావతి మాస్టర్ ప్లాన్ విస్తరణ

ముగిసిన తరువాత మాస్టర్ ప్లాన్ విస్తరణకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించనున్నారు. 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగురోడ్డుకు ఇప్పటికే గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనికితోడు ఇన్నర్ రింగురోడ్డు నిర్మాణమూ చేపట్టనున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లానును విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఇటీవల మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను రెండోదశ పూలింగు ప్రాంతానికి విస్తరించనున్నామని, వీటిని ఔటర్ రింగుకు అన్నివైపులా కలిపేలా ప్లానింగు ఉందని వెల్లడించారు.

తాజా ప్రతిపాదనల మేరకు తూర్పున 16వ నెంబరు జాతీయ రహదారి హద్దుగా దక్షిణం, పడమర ప్రాంతంలో ఔటర్ రింగురోడ్డు, ఉత్తరాన కృష్ణానది ప్రాంతం మధ్యలో పూర్తిగా ప్లానింగు ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. దాదాపుగా సిఆర్‌డిఏ రీజియన్ ప్రాంతం మొత్తం సమగ్ర ప్లానింగు పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం సిఆర్‌డిఏ ప్రాంతం సుమారు 8352 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. అంటే సుమారుగా 20.88 లక్షల ఎకరాలకు విస్తరించి ఉంది. దీనిలో కనీసం మూడు లక్షల ఎకరాల పరిధిలోకి రాజధాని ప్లానింగు ఏరియా పెరుగుతుందనేది అంచనాగా వేస్తున్నారు. ప్రస్తుతం 16వ నెంబరు జాతీయ రహదారికి ఈ3, ఈ5 రోడ్లను కలపనున్నారు. ఈ3 రోడ్డును రెండోదశ ల్యాండ్ పూలింగు పరిధి వరకు తీసుకెళ్లే విధంగ ఆలోచన చేస్తున్నారు.

సమీకరణ ప్రాంతంలో రోడ్ కనెక్టివిటీ పూర్తి చేసిన తరువాత అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పనిలో పనిగా మొత్తం ఔటర్‌రింగురోడ్డుకూ అనుసంధానం చేయాలని భావిస్తున్నారు.కాగా, ఇన్నర్ రింగురోడ్డు, ఔటర్ రింగురోడ్డుకు మధ్యలో అభివృద్ధికి అవసరమైన ప్లానింగు చేయాలని తొలి మాస్టర్ ప్లాన్ ఖరారు వేళ నిర్ణయించారు. రాజధాని చుట్టుపక్కల ఏడు ప్రాంతాల ను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలుగా గుర్తించారు. రింగురోడ్లను కూడా వాటిని దృష్టిలో పెట్టుకునే ప్లాను చేశారు. గుడివాడ, గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, కంచికచర్ల, కంకిపాడు, ఉయ్యూరు పరిసరాల్లో ప్రత్యేక అభివృద్ధి కేంద్రాలనూ ఏర్పాటు చేయాలనేది అప్పటి ప్రతిపాదన. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా గుడివాడ, ఆహ్లోద, పర్యాటక ప్రాంతంగా తెనాలి, లాజిస్టిక్ కేంద్రంగా గన్నవరం ప్రాంతాలను అప్పట్లో ప్రతిపాదించారు. ప్రస్తుతం మాస్టర్‌ప్లాను రూపొందించాలనే మంత్రి ప్రకటన నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా ఎలాంటి ప్రతిపాదనలు చేస్తారనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# నారావారిపల్లెలో లోకేశ్ 81వ రోజు ప్రజాదర్బార్

మండలం నారావారిపల్లెలోని తన నివాసంలో భోగి పండుగ రోజున (బుధవారం) ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. పండుగ పూట ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ను కలిసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన లోకేశ్, వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను సావధానంగా విన్నారు. ప్రజాదర్బార్‌లో ప్రధానంగా భూ వివాదాలు, ఉద్యోగ సమస్యలు, స్థానిక అవసరాలపై వినతులు వెల్లువెత్తాయి. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం బసినికొండ గ్రామానికి చెందిన పత్తి శివకుమార్, తమకు వారసత్వంగా సంక్రమించిన 1.83 ఎకరాల భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. అలాగే, రామసముద్రం మండలం బలిజపల్లికి చెందిన కె. పార్వతి, తమ రెండెకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మరోవైపు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు సంబంధించిన పలు అంశాలపై కూడా మంత్రికి విజ్ఞప్తులు అందాయి. తిరుమలలో అంగప్రదక్షణ కోసం ప్రస్తుతం ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి, భక్తుల సౌలభ్యం కోసం గతంలో మాదిరిగా ఆఫ్‌లైన్ టోకెన్లు జారీ చేయాలని 'తిరుమలలో అంగప్రదక్షణ భక్తబృందం' ప్రతినిధులు కోరారు.

అదేవిధంగా, టీటీడీలో సొసైటీ విధానంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇతర ఉద్యోగులతో సమానంగా వైద్య సదుపాయం, శ్రీవారి దర్శనం కల్పించాలని సిబ్బంది విన్నవించుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు కోల్పోయిన వారు సైతం తమ గోడును మంత్రి లోకేశ్ ముందు వెళ్లబోసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో తొలగించిన 160 మంది కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ సూపర్‌వైజర్లకు తిరిగి ఉద్యోగావకాశం కల్పించాలని ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ కాంట్రాక్ట్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

తిరుపతి పరిసర ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న 150 ఎస్టీ ఎరుకల కుటుంబాలకు ఒకేచోట ఇళ్ల స్థలాలు కేటాయించాలని శ్రీ వేంకటేశ్వర ఎస్టీ ఎరుకల సంఘం విజ్ఞప్తి చేసింది. చిత్తూరు జిల్లా నింద్ర మండలం కచ్చరావేడు గ్రామంలో దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరారు. అందిన ప్రతి వినతిని ఓపికగా పరిశీలించిన మంత్రి లోకేశ్, సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ప్రజలు, కార్యకర్తలతో కలిసి ఫోటోలు దిగారు.

# మహిళలను అవమానించడం క్రూరత్వమే

మహిళలపై వ్యక్తిగత దాడులు చేయడం, వారి చరిత్రను కించపరచడం, అసభ్య వ్యాఖ్యలు చేయడం విమర్శలు అనిపించుకోవు అన్నారు. అలాంటి చర్యలు కేవలం క్రూరత్వం మాత్రమేనని, మహిళా అధికారులపై ఉద్దేశపూర్వక దుష్ప్రచారం చేయడం అత్యంత ఆందోళనకరమైన విషయం అన్నారు. వారిని వ్యక్తిగతంగా దెబ్బతీయడం, ప్రతిష్ఠను నాశనం చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సజ్జనార్ పేర్కొన్నారు.

### మహిళా శక్తి - అపరిమితమైన గౌరవం

ఒక మహిళ ప్రభుత్వ ఉద్యోగి అయినా, ప్రైవేట్ ఉద్యోగి అయినా, లేదా గృహిణి అయినా ఆమెకు అపరిమితమైన గౌరవం ఇవ్వాలి. నేటి మహిళ అన్ని రంగాల్లో ముందువరుసలో ఉండి నాయకత్వం వహిస్తోంది. పాలనలో, పోలీసు శాఖలో, శాస్త్ర సాంకేతిక రంగంలో, మీడియా రంగం సహా పలు రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒకవైపు ఇంటి పనులు, మరోవైపు ఉద్యోగం చేయడం, ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ఎన్నో కనిపించని బాధ్యతలను భుజాన వేసుకుని మహిళలు కుటుంబాన్ని, సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ఇలాంటి మహిళలపై దాడులు చేయడం అంటే సమాజ ప్రగతిపై దాడి చేయడమే అన్నారు.

### భారతీయ సంస్కృతి, సామాజిక బాధ్యత

మన భారత సాంప్రదాయం ఎప్పుడూ ఒకే సందేశాన్ని ఇస్తుందని "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" (ఎక్కడ మహిళలు పూజింపబడతారో, అక్కడ దేవతలు కొలువై ఉంటారు) అని సజ్జనార్ తన ట్వీట్లో గుర్తుచేశారు. మహిళలకు గౌరవం ఉన్న చోటే సుభిక్షంగా ఉంటుంది. కానీ దురదృష్టవశాత్తు నేడు టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, కథనాల పేరుతో మహిళలపై జరుగుతున్న దూషణలు అసహ్యకరంగా మారుతున్నాయని తెలిపారు. మహిళలను గౌరవించని సమాజం తన భవిష్యత్తును కోల్పోతుందని, దేశాన్ని ముందుండి నడిపిస్తున్న మహిళలను కించపరచడం దేశానికే పెద్ద నష్టం అని హెచ్చరించారు.

### ఇక సహించబోము

మహిళలపై జరుగుతున్న అవమానం, వివక్ష, చరిత్ర హననాన్ని ఇకపై ఎంతమాత్రం సహించబోం అని ఈ సందర్భంగా స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఇక సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించే వారు, మహిళలపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేసే వారు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందే అన్నారు. భవిష్యత్తు మహిళలదే అని, ఆ భవిష్యత్తు పరస్పర గౌరవంతోనే నిర్మితమవుతుంది కానీ, అవమానాలతో కాదు అని సజ్జనార్ సూచించారు.

# కొత్త సర్పంచ్‌లకు శిక్షణ

కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు జనవరి 19 నుంచి ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా కేంద్రాల్లో 5 రోజుల పాటు గ్రామ పాలన, పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన కల్పించనున్నారు. 100 మందికి ఒక బ్యాచ్ చొప్పున విభజించి 5 విడతలుగా ఈ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. అంతేకాకుండా పంచాయతీ పాలనలోని వ్యవస్థలు, గ్రామ పంచాయతీల అధికారాలు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు వంటి 24 అంశాలకు సంబంధించిన అంశాలపై కొత్త సర్పంచ్‌లకు అవగాహన కల్పిస్తారు. అంతేకాకుండా పల్లె పాలనలో కీలకమైన గ్రామసభలు పంచాయతీ ఎలా నిర్వహించాలి అనే విషయాలపై పాఠాలు చెబుతారు. కాగా, జనన, మరణాల నమోదు చేయడం, ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణపై తరగతులు నిర్వహిస్తారు. వీటితో పాటు గ్రామ పాలనకు సంబంధించి అన్ని విషయాలను కొత్త పాలకవర్గాలకు వివరిస్తారు. కొత్త సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చేందుకు ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, ఎంపీవోలతో పాటు.. రిటైర్డ్ ఎంపీడీవోలను రిసోర్సు పర్సన్లుగా సెలెక్ట్ చేశారు. వారికి హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థ(ఐఆర్‌డీ)లో ఇటీవల ట్రైనింగ్ ఇచ్చారు. తర్వాత వీరంతా జిల్లాల్లో సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వనున్నారు. సర్పంచ్‌ల ట్రైనింగ్ పూర్తయ్యాక ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు డివిజన్, మండల కేంద్రాల్లో ట్రైనింగ్ ఇస్తారు.ఇదిలా ఉండగా, తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు తీపికబురు అందింది. ఈ మేరకు పల్లెలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు విడుదల కానున్నాయి. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ముగిసి కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడంతో నిధుల విడుదలకు ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద రావాల్సిన రూ. 2,500 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ఈ నెలాఖరులోపు రూ. 1,000 కోట్లు, ఫిబ్రవరిలో మరో రూ. 1,500 కోట్లు విడుదల చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

# శబరిమలలో మకరజ్యోతి దర్శనం

శబరిమల (ప్రశ్న న్యూస్) కేరళలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శబరిమలలో మకరజ్యోతి దర్శనం అశేష భక్తజన సందోహం మధ్య కనులపండువగా జరిగింది. మకర సంక్రాంతి పుణ్యదినమైన బుధవారం సాయంత్రం 6:30 గంటల తర్వాత పొన్నాంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు భక్తులకు దర్శనమిచ్చింది. ఈ అపురూప దృశ్యాన్ని తిలకించిన లక్షలాది మంది భక్తులు "స్వామియే శరణం అయ్యప్ప" అంటూ చేసిన శరణుఘోషతో శబరిగిరులు మార్మోగిపోయాయి. అంతకుముందు, పందళం రాజప్రాసాదం నుంచి తీసుకొచ్చిన పవిత్రమైన తిరువాభరణాలను అయ్యప్ప స్వామికి అలంకరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక దీపారాధన నిర్వహించారు. ఆ వెంటనే పొన్నాంబలమేడు కొండపై దివ్యజ్యోతి కనిపించడంతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. మకరజ్యోతిని సాక్షాత్తు అయ్యప్ప స్వామి జ్యోతిర్మయ రూపంగా భక్తులు విశ్వసిస్తారు. ఈ జ్యోతిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోయి, కోరిన కోరికలు నెరవేరతాయని ప్రగాఢంగా నమ్ముతారు. మకరజ్యోతి దర్శనం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. రద్దీని నియంత్రించేందుకు కొండపైకి పరిమిత సంఖ్యలోనే భక్తులను అనుమతించారు. క్షేత్రానికి రాలేని భక్తుల కోసం పలు టీవీ ఛానెళ్లు, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందించాయి. ఏటా మకర సంక్రాంతి నాడు జరిగే ఈ వేడుక కోసం దేశ నలుమూలల నుంచి భక్తులు 41 రోజుల కఠిన దీక్షతో శబరిమలకు చేరుకుంటారు.

# ములుగు జిల్లా రద్దు

నడుస్తోంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా కూడా రద్దవుతోందని ప్రచారం జరుగుతున్న క్రమంలో ఈ ప్రచారాన్ని మంత్రి సీతక్క ఖండించారు."ములుగు జిల్లా ఏర్పాటు కోసం పోరాడిన వాళ్లం. అలాంటిది ములుగు జిల్లాను ఎందుకు రద్దు చేస్తాం..? టీఆర్ఎస్ హయంలో నూతన జిల్లాల ఏర్పాటు అశాస్త్రీయంగా జరిగింది. పాలనా సౌలభ్యాన్ని పట్టించుకోకుండా, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా అస్తవ్యస్తంగా జిల్లాల సరిహద్దులను నిర్ణయించారు. ఒక మండలం మొత్తం ఒకే జిల్లాలో ఉండాలన్నది ప్రజల కోరిక" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. "ములుగు జిల్లాలో ఒక మండలం ఉంటుంది. అందులోని ఐదు గ్రామాలు పక్కన భూపాలపల్లి జిల్లాలో ఉంటాయి. అలాంటప్పుడు ప్రజలకు పాలనా ఫలాలు ఎలా అందుతాయి. రెవెన్యూ, పోలీసు సరిహద్దులు ఒకేలా ఉండాలి. కానీ ఆ విధానాన్ని కేసీఆర్ అవలంబించలేదు. దీంతో జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలు రెండు జిల్లాల కలెక్టరేట్ల చుట్టూ తిరగాల్సి వస్తుంది.

అభివృద్ధి పరమైన సమీక్ష సమావేశాల సంబంధించి ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే శాస్త్రీయ పద్ధతిలో జిల్లాల సరిహద్దు విషయంలో స్వల్ప మార్పులు ఉంటాయని సీఎం గారు చెప్పారు" అని మంత్రి సీతక్క తెలిపారు."ములుగు జిల్లా ఏర్పాటు నచ్చని వాళ్లే ములుగు జిల్లా రద్దవుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని ములుగు జిల్లా ప్రజలు నమ్మి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ములుగు జిల్లా అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తుంది. అలాంటప్పుడు ములుగు జిల్లా రద్దు అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. ములుగు ప్రజలు ఎవరు ఆందోళన పడొద్దు. ములుగు జిల్లా ఎక్కడికి పోదు ఇక్కడే ఉంటుంది అభివృద్ధి పథంలో అగ్ర భాగాన నిలుస్తుంది" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## నోటీసులు ఇస్తే సరిపోతుంది కదా..
## ఇంత దౌర్జన్యం ఎందుకు.?

పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అపహరించారని, ఒకరి ఇంటి తలుపులు బద్దలుకొట్టి మరీ లోపలికి ప్రవేశించారని ఆరోపించారు. కేవలం బెయిల్ ఇవ్వదగిన సెక్షన్లు ఉన్న కేసులో, బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం అవసరమా అని ఆయన ప్రశ్నించారు. మీడియా, డిజిటల్ మీడియాపై ఈ తరహా అణచివేత ధోరణి ఇప్పుడు రేవంత్ రెడ్డి పాలనకు ఒక నమూనాగా మారిందని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని హరీష్ రావు అన్నారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవం పై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. డీజీపీకి ఫోన్ చేసి వెంటనే జర్నలిస్టుల్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్న
# గంగోత్రి కాళీక పీఠాధిపతి



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని గంగోత్రి, కాళికా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ నారాయణ మహా స్వామి,శంకరాచార్యులుఆలయంలో స్వయంభూ మూర్తులను దర్శించుకున్నారు.స్వామివారి లడ్డు ప్రసాదం ఆలయ అధికారులు అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, ఆలయ నిర్మాణశైలి అద్భుతంగా తీర్చిదిద్దారని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో
## ఏకాదశి లక్ష పుష్పార్చనపూజలు





**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. సుగంధ పరిమళ పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమానుసారంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు పాల్గొన్నారు.

## గోదాదేవి, రంగనాయక స్వామి
# కళ్యాణోత్సవం



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** తిరుప్పావై మహోత్సవంలో భాగంగా తెలంగాణ లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలోగోదాదేవి,రంగనాయక స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఆలయ అర్చకులు.వేదమంత్రోచ్ఛరణలు మంగళ వాయిద్యల నడుమ అత్యంత వైభవంగా గోదాదేవి,రంగనాయక స్వామి వార్ల



కల్యాణ మహోత్సవం నిర్వహించారు.స్వామి అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో నయన మనోహరంగా అలంకరించి గోదాదేవి,రంగనాయక స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు అర్చకులు.కల్యాణ తంతులో స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, వంటి పర్వాలు శాస్త్రోక్తముగా కొనసాగాయి.సుమారు ఈ ఉత్సవం ఆలయంలోగంటన్నర పాటు జరిపారు ఆలయ అర్చకులు.గోదాదేవి,రంగనాయక స్వామి వారి కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణ మహోత్సవం వీక్షించారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, హనుమంతరావు దంపతులు, ఆలయ డీఈవో భాస్కర్ రావు,ఆలయ చైర్మన్ నరసింహ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

# కుక్కకాట్లకు భారీ పరిహారం

న్యూఢిల్లీ : కుక్కకాటు బాధితులకు భారీ పరిహారం చెల్లించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కుక్కకాటు ఘటనల్లో వాటి ప్రేమికుల్ని, వాటికి ఆహారం పెట్టేవారిని కూడా జవాబుదారీగా చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం హెచ్చరించింది. సంస్థల ప్రాంగణాలు, రహదారులపై వీధికుక్కల్ని తొలగించాలంటూ 2025 నవంబరు 7న ఇచ్చిన ఉత్తర్వులపై అనుకూల, ప్రతికూల వాదనల్ని వింటున్న ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. "కుక్క కరవడం వల్ల ఏ ఒక్కరు గాయపడినా, ప్రాణాలు కోల్పోయినా.. వారు పిల్లలైనా, పెద్దలైనా మేం మాత్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీ పరిహారం అడుగుతాం. ఎందుకంటే– వీధి కుక్కలను నియంత్రించడానికి నిబంధనలు పాటించాల్సిందిగా గత ఐదేళ్లుగా మేం చెబుతున్నా దానిని అమలు చేయడంలో రాష్ట్రాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. వీధికుక్కలకు ఆహారం పెట్టేవారూ ఈ ఘటనలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. మీకు ఈ జంతువులపై అంత ప్రేమ పొంగిపోతుంటే వాటిని మీ ఇళ్లకే ఎందుకు తీసుకువెళ్లకూడదు? వీధి కుక్కల సమస్య భావోద్వేగపూరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కుక్కలపై మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు మనచుట్టూ తిరుగుతూ, కరుస్తూ, భయపెట్టడమేమిటి?" అని జస్టిస్ నాథ్ ప్రశ్నించారు. దానితో జస్టిస్ మెహతా ఏకీభవించారు. 'ఒక తొమ్మిదేళ్ల పిల్లాడిపై కుక్కలు దాడిచేస్తే ఎవరిని జవాబుదారీని చేయాలి? దానికి తిండిపెట్టిన సంస్థనా? ఈ సమస్యపై మేం కళ్లు మూసుకుని కూర్చోవాలని మీరు కోరుకుంటున్నారా?' అని ఆయన ప్రశ్నించారు.

## అప్పుడు భూతల దాడులకూ సిద్ధమయ్యాం

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధత దీనిద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన దిల్లీలో మీడియా సమావేశంలో వివిధ అంశాలపై మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్'ను చాలా కచ్చితత్వంతో అమలుచేశాం. 88 గంటల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత సమర్థంగా పనిచేశాయి. ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేయగలిగాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించాం. పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా.. భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా నాడు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం' అని ఆర్మీ చీఫ్ నాటి పరిస్థితులను వివరించారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని, అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడించారు. చైనా సరిహద్దులోని భద్రత గురించి మాట్లాడుతూ.. భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు.

## వినియోగదారులకు క్షమాపణలు తెలిపిన నెస్లె సిఇఒ



30కి పైగా దేశాలు కొన్ని బ్యాచ్‌ల శిశు పోషకాహార ఉత్పత్తులను వెనక్కిపంపడంపై నెస్లె సిఇఒ పిలిప్ నవ్రాటిల్ వినియోగదారులకు క్షమాపణలు తెలిపారు. పరిస్థితిని వివరించే ముందు, తల్లిదండ్రులు, శిశుసంరక్షకులు మరియు వినియోగదారులకు కలిగించిన ఆందోళన, అంతరాయానికి క్షమాపణలు కోరుతున్నాను అని కంపెనీ వీడియోలో నవ్రాటిల్ పేర్కొన్నారు. వెనక్కి పంపిన ఉత్పత్తులను ఇప్పుడు ప్రకటించనున్నట్లు తెలిపారు. వాంతులు, వికారానికి కారణమయ్యే విషపూరిత రసాయనాలు ఉన్నందున శిశు ఉత్పత్తులను పలు యూరోపియన్ యూనియన్ దేశాలు, ఆస్ట్రేలియా,బ్రెజిల్, చైనా, మెక్సికో మరియు దక్షిణాఫ్రికా సహా సుమారు 37 దేశాలు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా వెనక్కి పంపిన ఉత్తత్తులను భారతదేశంలో దిగుమతి చేసుకోవడం లేదా విక్రయించడం లేదని నెస్లె స్పష్టం చేసింది. ప్రతి ఉత్పత్తిని స్థానికంగా తయారు చేస్తామని పేర్కొంది

## ఉదయాన్నే ఖాళీకడుపుతో మునగాకు నీరు తాగితే..!



తినాలన్న కోరికను తగ్గించడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. డయాబెటిస్ ను నియంత్రిస్తుందిఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది, డయాబెటిక్ రోగులకు మరియు ప్రీ డయాబెటిక్ లక్షణాలను ఎదుర్కొంటున్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. నిర్విషీకరణ, ఎనర్జీ బూస్ట్నేచురల్ డిటాక్సిఫైయింగ్ గుణాలు కాలేయం, మూత్రపిండాల పనితీరుకు సహాయపడతాయి. శరీరాన్ని నిర్విషీకరణ చేస్తాయి. శక్తి స్థాయిలను పెంచుతాయి.మునగాకు దాని సూక్ష్మపోషకాల కారణంగా ఆహారంగా, ఔషధంగా రెండు రకాలుగా పురాతన కాలం నుండి వినియోగంలో ఉంటూ వస్తోంది. పరగడుపున తీసుకుంటే శరీరంలోని వివిధ వ్యాధులు, పోషక లోపాలను తొలగించడానికి మునగాకు నీరు ఉపయోగపడుతుంది. పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.మునగాకులో అవసరమైన విటమిన్లు (ఎ, సి, ఇ), ఖనిజాలు (కాల్షియం, పొటాషియం, ఇనుము) యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. నొప్పి నివారణదీనిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు నొప్పులను తగ్గిస్తాయి. ఇది ఎముక సాంద్రత మరియు బోలు ఎముకల వ్యాధి నివారణకు ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. మెటబాలిజం బూస్ట్, బరువు తగ్గడంమునగాకు నీరు జీవక్రియను మెరుగుపరుస్తుంది. తినాలన్న కోరికను తగ్గించడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. డయాబెటిస్ ను నియంత్రిస్తుందిఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది, డయాబెటిక్ రోగులకు మరియు ప్రీ డయాబెటిక్ లక్షణాలను ఎదుర్కొంటున్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది. నిర్విషీకరణ, ఎనర్జీ బూస్ట్నేచురల్ డిటాక్సిఫైయింగ్ గుణాలు కాలేయం, మూత్రపిండాల పనితీరుకు సహాయపడతాయి. శరీరాన్ని నిర్విషీకరణ చేస్తాయి. శక్తి స్థాయిలను పెంచుతాయి. చర్మ ఆరోగ్యం, రక్తహీనత చికిత్సవిటమిన్ ఇ, ఇనుము సమృద్ధిగా ఉన్న మునగాకు ఆరోగ్యకరమైన చర్మాన్ని అందిస్తుంది. మొటిమలను తగ్గిస్తుంది. జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది. ఐరన్ స్థాయిలను మెరుగుపరచడం ద్వారా రక్తహీనత చికిత్సకు సహాయపడుతుంది.

### భారత జీడీపీ వృద్ధి అంచనాలను

## అప్‌గ్రేడ్ చేసిన ప్రపంచ బ్యాంకు




వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌లో అంచనా వేసిన 6.3 శాతంగా అంచనా వేసింది. ప్రస్తుతం దీన్ని 6.5 శాతానికి సవరిస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు మంగళవారం ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును కొనసాగిస్తుంది. అమెరికాకు పంపే కొన్ని ఎగుమతులపై అధిక సుంకాలు ఉన్నప్పటికీ, ఇది భారత వస్తువుల ఎగుమతుల్లో దాదాపు 12 శాతం వాటాయే ఉంది. ప్రధానంగా దేశీయ డిమాండ్‌లో బలమైన ఊపు, గతంలో ఊహించిన దానికంటే అధిక స్థిరమైన ఎగుమతుల ద్వారా ప్రతికూల ప్రభావాలను భారత్ అధిగమిస్తుందని ప్రపంచ బ్యాంకు తన తాజా గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గితే భారత వృద్ధి అంచనా మరింత మెరుగుపడుతుందని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. కొన్ని వాణిజ్య సమస్యలకు పరిష్కారం లభించడం, అమెరికా సుంకాలను పాక్షికంగా ఉపసంహరించుకుంటే, భారత ఎగుమతులు ఊహించిన దానికంటే వేగంగా పెరగవచ్చు. వాణిజ్య అడ్డంకులను తగ్గించడానికి దేశాల మధ్య చర్చలు మరింత విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో కూడా సహాయపడతాయి. తద్వారా వ్యాపార, వినియోగదారుల విశ్వాసం పెరుగుతుంది, దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో అధిక వ్యయం, అధిక పెట్టుబడులకు ఆస్కారం ఉంటుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది.

## మరిన్ని దేశాలకు యూపీఐ విస్తరణ

### – డీఎఫ్ఎస్ కార్యదర్శి



మనదేశ స్వదేశీ డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ని మరిన్ని దేశాలకు విస్తరించడంపై దృష్టి సారిస్తున్నట్టు ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు తెలిపారు. అంతర్జాతీయ ఉనికిని విస్తృతం చేస్తూఉ, ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ముఖ్యంగా తూర్పు ఆసియా మార్కెట్లలో యూపీఐ పరిధిని విస్తరించడంపై దృష్టి సారిస్తోందన్నారు. మంగళవారం జరిగిన గ్లోబల్ ఇంక్లూజివ్ ఫైనాన్స్ ఇండియా సమ్మిట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం దేశంలో యూపీఐ ద్వారా లావాదేవీలు సుమారు 50 శాతం డిజిటల్ రూపంలో జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని దేశాలకు యూపీఐని విస్తరించాం. ఇప్పుడు మరిన్ని దేశాలకు, ముఖ్యంగా తూర్పు ఆసియాపై దృష్టి సారిస్తున్నామని అన్నారు. యూపీఐ ఇప్పటికే ఎనిమిది దేశాలలో – భూటాన్, సింగపూర్, ఖతార్, మారిషస్, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), శ్రీలంక, ఫ్రాన్స్ – అందుబాటులో ఉంది. దీనివల్ల భారతీయ ప్రయాణికులు యూపీఐని ఉపయోగించి విదేశాలలో డిజిటల్ చెల్లింపులు చేయడానికి వీలవుతోందని నాగరాజు చెప్పారు. గతేడాది డిసెంబర్‌లో యూపీఐ లావాదేవీలు 2,100 కోట్లకు పైగా జరిగాయని నాగరాజు తెలిపారు. ఇది దేశంలో డిజిటల్ చెల్లింపుల వేగాన్ని సూచిస్తుందన్నారు. ఇదే సమయంలో దేశంలో కొన్ని కోట్ల మైక్రో యూనిట్ సంస్థలు ఉన్నప్పటికీ, అవి మధ్య తరహా, పెద్ద సంస్థలుగా ఎదగడం లేదని అభిప్రాయపడ్డారు. మైక్రో యూనిట్లను మధ్య తరహా సంస్థలుగా మార్చాల్సిన అవసరం ఉందని ఎం నాగరాజు స్పష్టం చేశారు. మైక్రో సంస్థలకు మద్దతు, మార్కెట్ యాక్సెస్, సాంకేతికతతో పాటు హార్డ్‌వేర్ ద్వారా ఉత్పాదకత లాభాలు లభించినప్పుడే ఇది జరుగుతుందని భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

## రూ. 4 లక్షల కోట్లకు దేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు



2025లో మనదేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్ల మార్కును దాటాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం తెలిపారు.ఈ ఏడాది నాలుగు సెమీకండక్టర్ తయారీ ప్లాంట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా ఇవి మరింత పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో దీని గురించి పోస్ట్ చేసిన మంత్రి, ఎగుమతులు పెరగడంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలను సృష్టి జరిగిందని, విదేశీ మారక ద్రవ్య ఆదాయాన్ని పెంచిందని అన్నారు. 2025లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు దాటాయి. ఉద్యోగాలను, విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకువచ్చాయి. నాలుగు సెమీకండక్టర్ ప్లాంట్లు వాణిజ్య ఉత్పత్తిలోకి రావడంతో 2026లో కూడా ఇదే ఊపు కొనసాగుతుందని వెల్లడించారు. అధికారిక అంచనాల ప్రకారం, 2024–25లో దాదాపు రూ.11.3 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి జరిగింది. ఇందులో ఎగుమతుల విలువ దాదాపు రూ.3.3 లక్షల కోట్లుగా ఉంది. ఈ రంగం ప్రస్తుతం 25 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తోంది. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీలో ఎక్కువ భాగం మొబైల్ ఫోన్లే ఉన్నాయని పరిశ్రమ వర్గాలు పేరొన్నాయి. గతేడాది మన్దేశం నుంచి ఐఫోన్ ఎగుమతులు రూ. 2.03 లక్షల కోట్లకు చేరుకున్నాయని, ఇది అంతకుముందు 2024లో నమోదైన రూ. 1.1 లక్షల కోట్ల కంటే దాదాపు రెట్టింపు అని మంత్రి పోస్ట్‌లో పేర్కొన్నారు. భారత సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో మొబైల్ ఫోన్ ఉత్పత్తి 75 బిలియన్ డాలర్ల(రూ. 6.77 లక్షల కోట్ల)కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తన నివేదికలో ప్రస్తావించింది. వీటిలో 30 బిలియన్ డాలర్ల(రూ. 2.70 లక్షల కోట్ల) ఎగుమతులు ఉన్నాయి.

### రష్యా ఇంధన దిగుమతుల్లో

## మూడో స్థానానికి భారత్




రష్యా నుంచి శిలాజ ఇంధనాల కొనుగోలుదార్లలో భారత్ మూడో స్థానానికి పరిమితమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ప్రభుత్వ చమురు రిఫైనరీలు, రష్యా నుంచి దిగుమతులు తగ్గించడం ఇందుకు నేపథ్యమని మేధో సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్(సీఆర్ఈఏ) పేర్కొంది. డిసెంబరులో భారత్ మొత్తం మీద 2.3 బిలియన్ యూరోల (సుమారు రూ.24,150 కోట్లు) విలువైన ముడిచమురు ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. నవంబరు దిగుమతులు 3.3 బి. యూరోలు కావడం గమనార్హం. 2.6 బి. యూరోల విలువైన రష్యా ముడిచమురు కొనుగోళ్లతో, తుర్కియే రెండో స్థానాన్ని భర్తీ చేసింది. రష్యా చమురు కొనుగోలులో చైనా అగ్రగామిగా కొనసాగుతోంది. రష్యా అగ్రగామి 5 సంస్థలకు వచ్చిన ఎగుమతి ఆదాయాల్లో, చైనా వాటా 48% (6 బిలియన్ యూరోలు) కావడం గమనార్హం. రష్యా నుంచి భారత్ కొనుగోళ్లలో చమురు వాటా 78 శాతంగా ఉంటోంది. దీని విలువ 1.8 బి. యూరోలు(దాదాపు రూ.18,900 కోట్లు). తర్వాతి స్థానాల్లో బొగ్గు(424 మి. యూరోలు), చమురు ఉత్పత్తులు (82 మి. యూరోలు) ఉన్నాయి.

## 44.89 లక్షల పీవీల టోకు విక్రయాలు



వాహన కంపెనీల నుంచి డీలర్లకు ప్రయాణికుల వాహన (పీవీ–కార్లు, జీపులు, వ్యాన్లు) సరఫరాలు 2025లో 44,89,717కు చేరాయని తయారీదార్ల సమాఖ్య సియామ్ మంగళవారం వెల్లడించింది. 2024లో సరఫరా అయిన 42,74,793 వాహనాల కంటే ఇవి 5% ఎక్కువ. జీఎస్‌టీ రేట్లు తగ్గడం, పండగ సీజన్‌లో బలమైన అమ్మకాల వల్ల, ఒక క్యాలెండర్ ఏడాదిలో 2025 రికార్డు సృష్టించిందని పేర్కొంది. 'భారతీయ వాహన పరిశ్రమకు గత ఏడాది మైలురాయిగా నిలిచింది. తొలి అర్ధ భాగంలో స్తబ్దుగా కనిపించిన పరిశ్రమ, సరఫరా సవాళ్లను ఎదుర్కొంది. ఆదాయపు పన్ను ఉపశమనం, రెపో రేటు కోతలు, జీఎస్‌టీ 2.0 వంటి బహుళ నిర్మాణాత్మక సంస్కరణలతో .. వాహనాలకు సానుకూల గిరాకీ వాతావరణం ఏర్పడింద'ని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర వెల్లడించారు. స్థిరమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, అందుబాటు ధరలు, విధాన మద్దతుతో 2026లో కూడా పరిశ్రమ సానుకూల ధోరణిలో పయనించే అవకాశం ఉందని అంచనా వేశారు.

## మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ జోరు.. 2025లో రూ.3.34 లక్షల కోట్లతో సరి




భారతీయ ఆర్థిక విపణిలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు సరికొత్త చరిత్రను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ విధానం పట్ల సామాన్య మదుపరులలో ఆసక్తి విపరీతంగా పెరగడం విశేషం. 2025 క్యాలెండర్ ఏడాదిలో ఇన్వెస్టర్లు ఏకంగా రూ.3.34 లక్షల కోట్లను మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేశారు. ఇప్పటివరకు నమోదైన వార్షిక పెట్టుబడుల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం, ఇది భారత ఆర్థిక వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది.గడచిన మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే పెట్టుబడుల వృద్ధి రేటు ఆశ్చర్యకరంగా కనిపిస్తోంది. 2023 సంవత్సరంలో రూ.1.84 లక్షల కోట్లుగా ఉన్న పెట్టుబడులు, 2024 నాటికి రూ.2.68 లక్షల కోట్లకు చేరుకున్నాయి. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే ఈ స్థాయిలో వృద్ధి నమోదు కావడం పెట్టుబడిదారుల మారుతున్న ధోరణికి నిదర్శనం. ప్రతి ఏటా క్రమంగా పెరుగుతున్న ఈ సంఖ్యలు, స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకుంటూ దీర్ఘకాలిక లాభాల వైపు ప్రజలు అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేస్తున్నాయి.నేటి కాలంలో మదుపరులు సంప్రదాయ పొదుపు మార్గాల కంటే మ్యూచువల్ ఫండ్స్‌కే మొగ్గు చూపుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఆర్థిక క్రమశిక్షణతో పాటు సురక్షితమైన పెట్టుబడి మార్గంగా వాటిలు గుర్తింపు పొందడమే. నెలనెలా కొంత మొత్తాన్ని పొదుపు చేయడం ద్వారా భవిష్యత్తులో భారీ మొత్తంలో సంపదను సృష్టించుకోవచ్చనే అవగాహన మధ్యతరగతి వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీర్ఘకాలిక లక్ష్యాలైన పిల్లల చదువులు, రిటైర్మెంట్ ప్లానింగ్ కోసం చాలామంది ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, డిజిటల్ విప్లవం వల్ల ఇన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ సులభతరం కావడం కూడా ఈ రికార్డు స్థాయి వృద్ధికి దోహదం చేసింది. స్మార్ట్‌ఫోన్ యాప్స్ ద్వారా సామాన్యులు సైతం నేరుగా మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. రానున్న రోజుల్లో మ్యూచువల్ ఫండ్స్ రంగం మరింత విస్తరించడమే కాకుండా, దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. స్థిరమైన రాబడి, తక్కువ రిస్క్ ఉండటంతో కొత్త ఇన్వెస్టర్లు కూడా భారీ సంఖ్యలో మార్కెట్‌లోకి వస్తున్నారు.

## విద్యార్థులకు మాదకద్రవ్యాల పై అవగాహన




**నాచారం(ప్రశ్న న్యూస్)** యువత ఉజ్జ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని నాచారం ఎస్ఐ మైబెల్లి, ఎన్.డి.ఎఫ్ కన్వీనర్ నందికొండ శ్రీనివాస్ రెడ్డి, యాంటీ డగ్ ఫోరమ్ కన్వీనర్ మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి, పిలుపునిచ్చారు. నాచారం లోని మదర్సా సుఫ్ఫతుల్ ముస్లిమీన్ హాస్టల్‌లో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతను మత్తు పదార్థాల ముప్పు నుంచి రక్షించి, ఆరోగ్యవంతమైన మరియు బాధ్యతాయుత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, మత్తు పదార్థాల వాడకం వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువు, క్రమశిక్షణ, దేశ సేవ వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. గత డిసెంబర్ 31 మరియు జనవరి 6 తేదీల్లో నిర్వహించిన మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీల్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థులు, యువతకు సర్టిఫికెట్స్ సిడిఎస్ బిల్డింగ్‌లో ఘనంగా పంపిణీ చేశారు. మిగతా పాఠశాలలకు సంబంధించిన సర్టిఫికెట్ల పంపిణీ రాబోయే రోజుల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం పోలీస్ సిబ్బంది, గుంటుక కృష్ణా రెడ్డి,మామిడాల రాజా రెడ్డి, మొహమ్మద్ ఫసియుద్దీన్, నమిలికొండ సునీల్ రెడ్డి, జావీద్, వాలి, షెరీఫుద్దీన్, రేవంత్, ఎస్ఎస్ఎస్ యువసేన కిషోర్ రెడ్డి, కరుణాకర్, శ్రీధర్, స్నేహిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన.

**- మాజీ జెడ్పిటిసి మూల సరోజన- పురుషోత్తం రెడ్డి**

**- మాజీ సర్పంచ్ ఓడ్నాల ప్రవళిక -శ్రీనివాస్**



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శ్రీపాద కాలనీలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ పోటీలలో 25 మంది మహిళలు పాల్గొని వివిధ రకాల రంగవల్లులతో అలరించడం జరిగింది.ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ జెడ్పిటిసి మూల సరోజన పురుషోత్తం రెడ్డి , మాజీ సర్పంచ్ ,ఎంపీటీసీ ఓ డ్నాల ప్రవళిక శ్రీనివాస్ గార్ల చేతుల మీదుగా ప్రథమ బహుమతి కొమురోజు సరిత, ద్వితీయ బహుమతి చేమంతుల శ్రీవాణి, తృతీయ బహుమతి ఎస్ మనస్వి లకు బహుమతులు ప్రధానం చేశారు .అంతేకాకుండా పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే ముగ్గులతో మన ముంగిల్లు కళకళలాడుతాయని ప్రతి ఒక్కరు కూడా రంగురంగుల ముగ్గులు ఇంటి ముందట చిన్నాపెద్దా తేడా లేకుండా వేస్తారని అన్నారు .పాల్గొన్న మహిళలందరికీ భోగి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.గెలుపొందిన విజేతలను అభినందించారు బెజ్జంకి దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌లోకి తిరిగి ప్రవేశించిన బంగ్లాదేశ్ మహిళలు.. అరెస్ట్



ముంబై: భారత్ నుంచి బహిష్కరించిన ఇద్దరు బంగ్లాదేశ్ మహిళలు అక్రమంగా దేశంలోకి తిరిగి ప్రవేశించారు. ఆ మహిళల గురించి పోలీసులకు తెలిసింది. దీంతో వారిని అరెస్ట్ చేశారు. తిరిగి భారత్‌లోకి ప్రవేశించేందుకు ఎవరు సహకరించారు అన్నది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత ఏడాది ఆగస్ట్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన 38 ఏళ్ల జులేఖా జమాల్ షేక్‌ను ముంబై పోలీసులు బహిష్కరించారు. బంగ్లాదేశ్ అధికారులకు ఆమెను అప్పగించారు.కాగా, బంగ్లాదేశ్ మహిళ జులేఖా జమాల్ అక్రమ మార్గంలో తిరిగి ముంబై చేరుకున్నది. గేట్‌వే ఆఫ్ ఇండియా సమీపంలోని కామాతిపుర ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై నివసిస్తున్నది. ఈ సమాచారం తెలుసుకున్న ముంబై పోలీసులు మంగళవారం ఆమెను అరెస్ట్ చేశారు. విదేశీ చట్టం కింద కేసు నమోదు చేశారు.మరోవైపు బంగ్లాదేశ్‌కు చెందిన 30 ఏళ్ల బిల్కిస్ బేగం సిర్మియా అక్తర్‌ను కూడా గత ఏడాది ఆగస్ట్‌లో భారత్ నుంచి బహిష్కరించారు. అయితే ఆమె కూడా అక్రమ మార్గాల్లో తిరిగి ముంబై చేరుకున్నది. కఫ్ పరేడ్ ప్రాంతంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నది.ఈ సమాచారం తెలుసుకున్న ముంబై పోలీసులు బిల్కిస్ బేగం ఇంటిపై రైడ్ చేశారు. ఆమె మొబైల్ ఫోన్ పరిశీలించగా బంగ్లాదేశ్ మహిళగా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆమెను అరెస్ట్ చేశారు. బీఎన్ఎస్‌తోపాటు విదేశీ చట్టం కింద కేసు నమోదు చేశారు. బహిష్కరించిన బంగ్లాదేశ్ మహిళలు తిరిగి భారత్‌లోకి ప్రవేశించేందుకు ఎవరు సహకరించారు అన్నది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తాగునీటి కష్టాలు తీర్చాలని ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన

నార్నూర్ : గ్రామంలో తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బేతాల్ గూడ, సోనాపూర్ గిరిజనులు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గ్రామంలో 140 కుటుంబాలుండగా 7 వందల మంది జనాభా నివాసం ఉంటుందని గ్రామస్థులు వివరించారు. తాగు నీటి కోసం మిషన్ భగీరథ ద్వారా రెండు నీటి ట్యాంకులు, ఇంటింటా పైపులు, ట్యాపులు ఏర్పాటు చేసినా నేటికీ మిషన్ భాగీరథ నీరు అందకపోవడం విచారకరమని అన్నారు. బేతాల్ గూడలో ఒక చేతిపంపు, సోనాపూర్‌లో ఒక్క చేతి పంపు ఉంది. నీళ్ల కోసం ఈ చేతి పంపుల వద్ద స్థానికులు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు.40 ఏళ్ల క్రితం తాగునీటి కోసం వ్యవసాయ బావి నుంచి ఉన్న పైప్ లైన్‌కు మరమ్మతులు చేయడానికి పంచాయతీ వద్ద నిధులు లేకపోవడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. నీటి కష్టాలు తట్టుకోలేక బుధవారం గిరిజనులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు.విషయం తెలుసుకున్న సర్పంచ్ జాదవ్ పరమేశ్వర్ అక్కడికి చేరుకుని స్థానికులను సముదాయించారు. నీటి సమస్యని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు.

# మారాల్సిందే మనమే

**- ప్రీమియర్ షోలతో పైసా వసూల్ - సామాన్యులకు భారంగా టికెట్టు ధరలు**

**- సగటుగా రోజువారి కూలి రూ. 500 నుంచి 600**

**- ఒక్క ప్రీమియర్ షో రేటు రూ. 1000 పైనే ఇది ఎవరికి లాభం ఎవరికీ నష్టం**

**(అమీనా కలందర్ - ప్రశ్న న్యూస్ ప్రతినిధి)**





తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రీమియర్ షోల హవా ఎక్కువగా కొనసాగుతోంది. ఈ షోలతో నిర్మతలు టికెట్టు ధరలు సగటు సినిమా టికెటు కంటే మూడు నాలుగు ఇంతలు ఎక్కువగానే ఉంటుంది. దీంతో సినిమాలకు లాభాలు చేకూరుస్తున్నాయి. సాదారణంగా మూడు షోలు అంటే ఒక్క రోజులో సంపాదించేది. నిర్మతలు కేవలం రెండున్నర గంటల్లో సంపాదిస్తున్నారు. ఈ ప్రీమియర్ షోలతో చేస్తున్న దోపిడీకి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సహకరించడం విస్మయాన్ని కలిగిస్తున్నాయి. ఈ రకంగా దోపిడీ జరుగుతుంటే సామాన్యుడికి భారమౌతున్న సంగతి కనిపెట్టేదెవరు.. దీని గురించి ఇప్పుడు క్లుప్తంగా తెలుసుకుందాం..

### ప్రీమియర్ షోలతో పైసా వసూల్

తెలుగు సినీ నిర్మతలు.. ప్రభుత్వాలతో కుమ్మక్కై ప్రీమియర్ షో పేరుతో పేదల్ల డబ్బును సొంతం చేసుకుంటున్నారు. పైవరవీలు చూడకండి సినిమా వెనుక మా కష్టం ఉంటుంది. అని చెప్పిన నిర్మతలు. ప్రీమియర్ షోలు చూడడానికి వచ్చే మధ్యతరగతి ప్రేక్షకుల టికెట్టు ధర వెనుక ఓ వ్యక్తి చెమటచుక్క కొన్ని రోజులదై ఉంటుందని ఎందుకు మరిచిపోతున్నారు. ఒక కుటుంబంలో నలుగురు కలిసి సినిమాకు వెళ్లాలంటే రూ. 4000 కావాలి. ఇంట్రవెల్ బ్రేక్ లో కుటుంబానికి మొత్తానికి కలిసి మరో వెయ్యి రెండు వెయ్యిలు ఖర్చవుతుంది. అంటే రోజుకు రూ. 500 సంపాదించే వ్యక్తి ప్రీమియర్ షో చూడాలంటే దాదాపు తన వారం రోజుల కష్టాన్ని నీటిలో దారపోసినట్టే. నగరంలో జీవితం కొనసాగించే వారైతే.. వారం రోజులు ఉపావాసం ఉండాల్సి వస్తుందన్న సంగతి ఎంతమందికి తెలుసు.. ఎంత మంది కనుక్కుంటున్నారు.

### నగరంలో ఓ మధ్య తరగతి కుటుంబ జీవితం

నగరంలో ఒక వ్యక్తి కుటుంబంతో కలిసి జీవనం కొనసాగించాలంటే.. రూం రెంటూ.. పిల్లల చదువులు.. రోజువారి ఖర్చులు.. ఉద్యోగనికి రాకపోకల ఖర్చులు ఇలా అన్ని చూసుకుని ఉంటే తనకి చివరికి మిగిలేది బుడిద మాత్రమే. అలాంటి జీవితాల్లో ప్రీమియర్ షోల రెట్లు.. నగర వాసులకు చుక్కల్ని చూపిస్తున్నాయనే చెప్పాలి. సింగిల్ బెడ్ రూం రెంటూ పది వేల నుంచి పదిహేను వేలు, పిల్లల చదువులకు సంవత్సరానికి ఎంత చిన్న స్కూల్లో వేసిన సంవత్సరానికి దాదాపు 50 వేల నుంచి 60 వేలు.. ఇక రోజు వారి ఖర్చులు సరే సరి. ఇవి కాదన్నట్టు రూం రెంటుకు తోడు కరెంట్టు బిల్లు, బోరు బిల్లు.. ఇంటికి అథితులు వస్తే.. అదోక వెయ్యి ఎక్స్ ట్రాగా కట్టాలి. ఇక స్కూల్స్ లో వారికి రోజువారి స్నాక్స్ అని.. అప్పుడప్పుడు స్కూల్ కార్యక్రమాలకని మరో పది నుంచి ఇరవై వేలు. ఇక చెత్తవాడికి.. మున్సిపాలిటీ వారికి అదో ఖర్చు. మరి ఇదంతా చేసుకుంటూ ప్రీమియర్ షోకి వెళ్లాలంటే ఆ వ్యక్తి ఎంత ఖర్చు చేయాలో కాస్తా ఆలోచించండి.

### ప్రభుత్వాలు ఏం చేయాలి.

గతంలో పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో లో జరిగిన సంఘటనలో 'రేవతి'అనే మహిళ మృతి చెందడం వల్ల పెద్ద సినిమాలకు ప్రీమియర్స్ షో లను తగ్గించారు. కానీ పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన హరైహర వీరమల్లు సినిమా రీసెంట్ గా రిలీజ్ అయింది. దాంతో ప్రీమియర్ షోస్ కి మళ్ళీ పూర్వ వైభవం దక్కిందనే చెప్పాలి. దీంతో సిని నిర్మతల ప్రభుత్వానికి విన్నపాలు చేస్తూ ప్రీమియర్ షోలకు పరిమిషన్లు ఇస్తున్నారు. నగరంలో ఓ మధ్యతరగతి వ్యక్తి జీవితాన్ని చూసి ప్రభుత్వాలు ప్రిమియర్ షోలకు పరిమిషన్ ఇవ్వకూడదు. ఒకవేల ఇచ్చిన టికెట్టు ధరలను ఏ మాత్రం పెంచకూడదు. లేదంటే రేవతి లాంటి అమాయకుల జీవితాలు ఫణంగా పెట్టాల్సి వస్తుంది. నగరం మొత్తం ప్రిమియర్ షోల దగ్గర పోలీసు బందోబస్తులు ఏర్పాటు చేస్తే.. మిగితా ప్రజల సమస్యలు ఎవరు పట్టించుకుంటారు?. ఒక వేల పోలీసులు పీఎస్ లో ఉంటే రేవతి లాంటి వారి ప్రాణాలు ఎవరు కాపాడుతారు. ఇలా ఆలోచిస్తే.. ప్రీమియర్ షోలతో లాభాల కన్న సామన్య ప్రజల ప్రాణలకే ఎక్కువ ప్రమాదం ఉంది. కాబట్టి ప్రభుత్వాలు ప్రీమియర్ షోలను పూర్తిగా నిర్మూలిస్తే బాగుంటుంది.

### ప్రజలేం చేయాలి?

ప్రపంచంలో ఎక్కడ లేనట్టుగా ఫ్యానీజం మన ఇండియాలో ఉంది. ఫ్యానిజం అంటే ఎదుటి వారి అడుగు జాడల్లో నడవడం. కానీ.. ప్రీమియర్ షాలతో ప్రాణాలు తీసుకోవడం కాదు. హీరోల కట్టౌట్లతో థీయేటర్ ను అలంకరించడం వల్ల.. పాలాభిషేకం.. పుష్పాభిషేకం వల్ల లాభం ఏం ఉండదు. అవే డబ్బులతో ఓ పేద విద్యర్థి చదవుకు ఖర్చు పెట్టండి. ఓ పేదవాడి ఆరోగ్యాన్ని కాపాడడానికి హెల్త్ ఇన్స్ రెన్స్ చేయండి. మనం పెట్టే రూపాయికి తినే ఖర్చుతో నిండితే మన కడుపైనా నిండాలి లేదా ఓ పేదవాడి కడుపైనా నిండాలి అంతే కానీ.. ఫోటోలకు, పాలాభిషేకం పేరుతో రోడ్డుపై మురుగులా పారే పాలకు కాకుడదు. సినిమా బాగా ఆడితే వీలైతే.. ఆ హీరోని కలిసి ప్రేమగా అభినందించండి లేదా.. ట్వీట్టర్ లాంటి వాటిలో చెప్పండి. ప్రస్తుత సమాజంలో మన దగ్గర ఉన్నంతలోనే మనం బతలకాలి. బడాయిలకు పోయి అప్పుల పాలు కాకుడదు. సినిమా మొదటి రోజు చూసిన రెండో రోజు చూసిన అదే స్టోరి కొత్తగా ఏం మారదు. మొదటి రోజు చూస్తేనే ఫ్యాన్ కాదు. అలా అనుకుంటే సినిమా వారు ఫ్యాన్స్ కోసం ఒకే రోజు సినిమా నడిపిస్తారా? అలా చెయ్యలేరు కదా.. సినిమా ఆడినన్ని రోజులు ఆడనిస్తారు. మొదటి రోజు ఇష్టంతో వెళ్లి సినిమా బాగలేకపోతే బాధపడడం కన్న రెండవ రోజు ప్రశాంతంగా వెళ్లి చూడడమే మిన్న.

## క్రీడల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలి

**- ఏసీపీ ప్రశాంత్ రెడ్డి**



ధర్మసాగర్ : క్రీడల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలని, క్రీడలతో యువత పై స్థాయికి ఎదగాలని కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి సూచించారు. బుధవారం ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో ముప్పారం ప్రిమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ బహుమతుల ప్రధాన కార్యక్రమానికి ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతి ముప్పారం అరవింద్ టీమ్ కి షీల్డ్ తో పాటు, రూ.10వేల నగదు, రన్నరప్ సన్నీ టీమ్ రూ.5వేల నగదు ను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుంటిపల్లి రేణుక, ఉపసర్పంచ్ తాల్లపెల్లి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్, నాయకులు మహేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి, గుంటిపల్లి వెంకట్, కోతి సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోదాదేవి కల్యాణం



కట్టంగూర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భోగి పర్వదినాన్ని పురష్కరించుకుని కట్టంగూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ గోదా రంగనాయక స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి రామడుగు శ్రీనివాసశర్మ, రామడుగు అశ్విన్ కార్తీక్ ఆధ్వర్యంలో సుదర్శన హెూమం, ఉత్సవ విగ్రహాలు, అభిషేకం, కల్యాణ మహెూత్సంతో పాటు వేద మంత్రచరణాల మధ్య కల్యాణ తంతును జరిపించారు. ఇల్లెందుల కృష్ణమూర్తి మణెమ్మ, కొంపెల్లి లక్ష్మయ్య మంగమ్మ, కొంపెల్లి సైదులు సుజాత, బుడిగ సైదులు అనూష, రెడ్డిపల్లి సైదులు సైదమ్మ దంపతులు కల్యాణ తంతులో కూర్చొని క్రఅబశ్రీశ్రీతువు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి రమేశ్, కోమటి భాస్కర్, రుద్రాభట్ల జితేందర్ శర్మ, బండారు అరుణ గుప్తా, కాపుగంటి నరేశ్, బత్తిని సత్తయ్య, ఇల్లెందుల రాంమూర్తి, మీలా వేణుమాధవ్, మేడి విజయ్, కొల్లూరి శివ, శ్రీరామ సంధ్య వీరేశ్, కడవేరు కృష్ణవేణి, సంధ్యమ్మ, కొత్త శోభ, గుడిపాటి పద్మ, మూడుదుడ్ల అండాలు, గుండు రూప పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలకు విసిగి బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

జైనూర్ : అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చిన తరువాత మరోమాటతో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై విసిగి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ లో చేరారు. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం కాలేజీగూడాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఉపసర్పంచులతో పాటు మరో 70 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుతో ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. రావుజీగూడ ఉప సర్పంచ్ పెందూర్ గంగామణి, పవర్ గూడా ఉపసర్పంచ్ కరాడ్ లక్షింభాయి, వార్డు మెంబర్లు, నసు, ఇసాక్, జమీర్, దినేష్ బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మరుస్కోల సరస్వతి, మాజీ జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్ రావు, మాజీ సహకార సంఘం చైర్మన్ హన్ను పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాల, సర్పంచులు కొడప ప్రకాష్, మాడవి కౌసల్య, మాజీ సర్పంచ్ మాడవి, మాజీ ఎంపీటీసీ కుమ్ర భగవంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవపురం గ్రామ పెరిక సంఘం అధ్యక్షుడిగా మేకల గోవర్ధన్

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం చెన్నకేశవపురం గ్రామం పెరిక సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గ్రామ పెరిక సంఘం అధ్యక్షుడిగా మేకల గోవర్ధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మేకల రమేశ్, గౌరవ సలహాదారులుగా మేకల యల్లయ్య, మేకల కృష్ణయ్య, దేవరగట్ల వెంకటేశ్వర్లు, మేకల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా దేవరగట్ల వీర శేఖర్, కోశాధికారిగా మేకల చిన్న లక్ష్మయ్య, కార్యదర్శులుగా మేకల వెంకటేశ్వర్లు, బాదే వంశీ, గొల్ల సైదులు, దేవరగట్ల సతీశ్, కందిబండ నరసింహారావు, మేకల రమేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు పత్తిపాక వేణుదర్, సహాధ్యక్షుడు యర్రంశెట్టి రామలింగయ్య, సంయుక్త కార్యదర్శి నట్టే కిరణ్ కుమార్, కుల పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత

**- వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్: చల్లా వెంకట్రాజం**

**- రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా రూరల్ పోలీసుల వినూత్న ప్రయత్నం**

**- ట్రాఫిక్ నియమాలు పాటించిన వారికి గులాబీలతో అభినందనలు**




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** జాతీయ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా "అరివ్ అలైవ్ అనే థీమ్‌తో ఫాజుల్ నగర్ బస్టాండ్ వద్ద వేములవాడ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో భద్రతపై బాధ్యతా భావం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వేములవాడ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాజం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ, ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగిసి ప్రతి ఒక్కరు క్షేమంగా తమ ఇంటికి చేరాలనే సందేశాన్ని "అరివ్ అలైవ్ " థీమ్ తెలియజేస్తుందని అన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై వాహనదారులను అప్రమత్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ వినియోగించాలన్నారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించిన వాహనదారులకు గులాబీ పువ్వులు అందజేస్తూ అభినందించడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ఆకర్షణీయంగా నిర్వహించారు. పోలీసుల ఈ వినూత్న ప్రయత్నానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.ఽ

## సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా

# ఆనందం - ఐక్యత నింపాలి

**- జిల్లా ప్రజలందరికీ "సంక్రాంతి" శుభాకాంక్షలు**

**- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు అనుముల భాస్కర్ జిల్లా ప్రజాలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"సంక్రాంతి పండుగ మన గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. రైతుల కష్టానికి గుర్తింపునిచ్చే ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందం, ఐక్యత నింపాలి. జిల్లా ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు పండీ గ్రామం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను. సంక్రాంతి పండుగతో కొత్త ఆశలు, కొత్త ఉత్సాహం అందరిలో వెల్లివరించాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు.(

## గ్రామీణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక

# సంక్రాంతి పండుగ

**- జాగిర్యాల సర్పంచ్ : గడల ప్రసాద్**

**- ఘనంగా ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు - బహుమతులు ప్రధానం**



**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండలంలోని జగిర్యాల గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు,బాలురకు చిత్రలేఖన పోటీలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడల ప్రసాద్ మాట్లాడుతూ, "సంక్రాంతి పండగ మన గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. మహిళలు,చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ పోటీలు నిర్వహించాం. ఇటువంటి కార్యక్రమాలతో గ్రామంలో ఐక్యత, ఉత్సాహం మరింత పెరుగుతుంది" అని అన్నారు.ముగ్గుల పోటీ విజేతలకు మెమొంటోలు,నగదు బహుమతులు అందజేయగా, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ప్రథమ,ద్వితీయ బహుమతులుగా మెమొంటోలు అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగింది.గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ చేతుల మీదుగా మెమొంటోలు, నగదు బహుమతుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేశ్వర్, సురేష్, గంగారెడ్డి, గంగాధర్, సంజీవ్, రాజేందర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్, గోపి, రమేష్, గంగాధర్, దామోదర్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సన్మానం



**మంథని (ప్రశ్న న్యూస్)** ఇటీవల ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసుకున్న మీడియా ప్రతినిధులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సన్మానించారు. బుధవారం మంథనిలోని రాజగృహాలో ఆయనను మీడియా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలువగా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతోసన్మానించారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని, ప్రజలను చైతన్యం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన క్లబ్ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు.

## వి బి జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలి

**- 19న జరిగే నిరసన కార్యక్రమంలో కార్మిక కర్షకులు పాల్గొనాలి.**

**- బూడిద గణేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి.**



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలం లక్కేపూర్ గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శబూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గాంధీ పేరుతో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దుచేసి వి బి జి రాంజీ పథకాన్ని తీసుకువచ్చిందని ఈ పథకం అమలయితే గ్రామీణ ప్రాంతంలో పేదలు పని హక్కును కోల్పోతారని అన్నారు ఈ పథకానికి నిధులు తగ్గించి పనులను కాంట్రాక్టర్లకు అప్పజెప్పి కూలీలతో కాకుండా యంత్రాల ద్వారా పనిచేస్తారని అన్నారు దీనివల్ల వ్యవసాయ కార్మికులకు పని దొరకని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు గ్రామీణ ప్రాంతంలో ఉపాధి లేకుండా చేస్తున్న ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబురాలకు నాంది

**- మండల వ్యాప్తంగా ఘనంగా భోగి వేడుకలు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల వ్యాప్తంగా ఘనంగా భోగి వేడుకలను సంక్రాంతి పండుగలో భాగంగా బుధవారం భోగి వేడుకలను బోయినిపల్లి మండలం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.వేకువజామునే మహిళలు,బాలికలు ఇళ్ల ముంగిళ్లలో రంగు రంగులతో ఆకర్షణీయమైన ముగ్గులు వేయడంతో పండుగ శోభను సంతరించుకుంది. కొన్ని ఇళ్ల ముందు గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి, దీపాలు వెలిగిస్తూ సంప్రదాయానికి అద్దం పట్టారు.గ్రామాల్లో చిన్నారులు, యువత భోగి మంటల చుట్టూ చేరి పాత వస్తువులను దహనం చేస్తూ ఆనందంగా సందడి చేశారు. పెద్దలు ఒకరికి ఒకరు భోగి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి పండుగను జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు.భోగి వేడుకలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొని, సంక్రాంతి సంబరాలకు శుభారంభం పలికింది.

## విలాసాగర్ గ్రామంలో ఘనంగా శ్రీ వేంకటేశ్వర - గోదాదేవి కళ్యాణ వేడుకలు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ వెంకటేశ్వర--గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్యతో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు హాజరయ్యారు. అలాగే గట్టుబూత్కూర్, గర్షకుర్తి, చిన్న ఆచంపల్లి, పెద్ద ఆచంపల్లి గ్రామాల సర్పంచులు, ఆయా గ్రామాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు, కళ్యాణ కార్యక్రమంలో పాల్గొని వేడుకలను ఘనంగా జరిపారు.

## ఎం డి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ఘనంగా రంగోలి, కైట్ ఫెస్టివల్



**పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్)** తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పర్వదినం అని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన రంగోలి, కైట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల ఎం డి ఆర్ ఫౌండేషన్ ను అభినందించారు. తన బాల్యంలో సంక్రాంతి వచ్చిందంటే పండగ ముందు పండగ తర్వాత గాలిపటాలు ఎగురవేస్తూ స్నేహితులతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే వారమని.. నేటితరం సెల్ ఫోన్, సోషల్ మీడియా మాయలో పడి మన సంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఎం డి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శోభన్ బాబు జయంతి వేడుకలు




**తార్నాక(ప్రశ్న న్యూస్)** సినీ నటుడు దివంగత శోభన్ బాబు జయంతి వేడుకలను శోభన్ బాబు సేవా సమితి తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎమ్మెస్సార్ వర్మ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోతె శోభన్ రెడ్డి హాజరై శోభన్ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పద్మారావు, ప్రధాన కార్యదర్శి బి. లాల్ బహుదూర్ శాస్త్రి, రామకృష గంగాధర్, అశోక్,,రమణ. ప్రతాప్ రెడ్డి. నరసింగ్ రావు ప్రేమలత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# మరోసారి మానవత్వాన్ని చాటుకున్న తూడి లచ్చన్న

**- మృతుని కుటుంబానికి పరామర్శ - ప్రగాఢ సంతాపం**

**- ఆర్థికసాయం అందజేత**



**గంగాధర (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ జిల్లా,గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ అనుబంధ గ్రామమైన ఇస్తారుపల్లికి చెందిన చెన్నూరి ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న మృతుని మాతృమూర్తి చెన్నూరి సావిత్రమ్మను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ, "అకాలంగా ప్రాణాలు కోల్పోయిన ప్రశాంత్ కుటుంబానికి టీఎల్ యువసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఈ విషాదాన్ని కుటుంబం ధైర్యంగా ఎదుర్కొనాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం" అని అన్నారు. అనంతరం రూ.10 వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మృతుని తల్లి చెన్నూరి సావిత్రమ్మ మాట్లాడుతూ, "ఈ కష్ట సమయంలో మాకు ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందించిన లచ్చన్న కు మా కుటుంబం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు. ఆయన చూపిన మానవత్వాన్ని మేం ఎన్నటికీ మర్చిపోము" అని భావోద్వేగంగా తెలిపారు. అనంతరం పలువురుగ్రామస్తులు కూడా మాట్లాడుతూ, "ప్రశాంత్ కుటుంబానికి లచ్చన్న అండగా నిలవడం అభినందనీయం. ఇలాంటి సేవా దృక్పథం మరెందరికో ఆదర్శం" అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీఎల్ యువసేన సభ్యులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.




# నవీన్ పొలిశెట్టికి సంక్రాంతి కలిసొచ్చినట్టేనా?

టాలీవుడ్ యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా తెరకెక్కిన లేటెస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు' ప్రేక్షకులను ఫుల్‌గా అలరిస్తోంది. ఈ చిత్రంతో మారి దర్శకుడిగా టాలీవుడ్‌కు పరిచయం కాగా.. తొలి ప్రయత్నంలోనే తన మార్క్ కామెడీని బలంగా ప్రెజెంట్ చేశాడనే అభిప్రాయం వినిపిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలోకి వచ్చింది. రిలీజ్‌కు ముందే సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా.. ఫస్ట్ డే ఫస్ట్ షోల నుంచే పాజిటివ్ టాక్ దక్కించుకుంటోందిఇప్పటికే పలు ప్రాంతాల్లో షోలు పూర్తి కావడంతో సోషల్ మీడియాలో ప్రేక్షకులు తమ రివ్యూలను షేర్ చేస్తున్నారు. ముఖ్యంగా నవీన్ పొలిశెట్టి డైలాగ్ డెలివరీ, టైమింగ్, గోదావరి యాసలో వేసిన పంచ్‌లు సినిమాకు ప్లస్‌గా నిలిచాయని నెటిజన్లు చెబుతున్నారు. "నవ్వి నవ్వి బుగ్గలు నొప్పిలేస్తున్నాయి" అంటూ ఓ నెటిజన్ ట్వీట్ చేయడం ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఇక హీరోయిన్ మీనాక్షి చౌదరి గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకుందని కామెంట్స్ వినిపిస్తున్నాయి.


ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, నవీన్‌తో కెమిస్ట్రీ సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యూత్‌ను కూడా ఆకట్టుకునే అన్ని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉన్నాయని టాక్. సంక్రాంతి సీజన్‌లో రిలీజైన సినిమాల్లో 'అనగనగా ఒక రాజు' ముందంజలో ఉందని.. నవీన్ పొలిశెట్టికి ఈ పండుగ పూర్తిగా కలిసి వచ్చినట్టేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే జోరు కొనసాగితే బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలవడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# అసలైన విజయం ఇదే



మరీ ఎక్కువగా ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా... నటిగా తొలి అడుగులు వేస్తున్న సమయంలోనే శ్రీలీల అగ్ర హీరోలతో కలిసి నటించే అవకాశాల్ని అందుకుంది. ఆ అవకాశాలకు తగ్గట్టుగానే ఆమె తన అందంతో ప్రేక్షకుల్ని ఆకర్షించింది. హుషారైన డ్యాన్స్‌తో కమర్షియల్ సినిమాలకు తగ్గ కథనాయిక అనిపించుకుంది. తెలుగు సినిమాల్లో ఆమెకు పాటలతోనే ఎక్కువగా పేరొచ్చింది. అయితే ఇప్పుడు తన నటనకీ గుర్తింపు లభించిందనే ఆనందంలో ఉంది ఈ అచ్చ తెలుగమ్మాయి. ఇటీవలే శ్రీలీల తమిళంలో 'పరాశక్తి' చిత్రంలో నటించింది. ఆ సినిమాకి అక్కడ మిశ్రమ స్పందన లభించినా, శ్రీలీల నటనకి మాత్రం మంచి పేరొచ్చింది. అదే విషయాన్నే ఆమె ఓ వేడుకలో ప్రస్తావిస్తూ... ఎప్పుడూ పాటలు, డ్యాన్సులతోనే తనని గుర్తించేవారని, అందుకు భిన్నంగా మొట్ట మొదటిసారి పూర్తిగా తన నటన గురించే మాట్లాడుతున్నారని అంది. ప్రేక్షకులు, పరిశ్రమ నుంచి ప్రశంసలు లభిస్తుండడం ప్రత్యేకమైన అనుభూతిని పంచుతోందని, అసలైన విజయం ఇప్పుడు దక్కిందనే భావనలో ఉన్నానని చెప్పుకొచ్చింది శ్రీలీల. తమిళంలో ఆమె చేసిన తొలి సినిమా ఇదే. త్వరలోనే హిందీలోకీ అడుగు పెట్టనుంది.

# ఆ పని చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా



హాట్ బ్యూటీ మలైకా అరోరా వయసుతో సంబంధం లేకుండా గ్లామర్‌కు కొత్త నిర్వచనం చెబుతోంది. 52 ఏళ్ల వయసులోనూ ఐటెం సాంగ్స్‌తో స్టేజ్‌ను షేక్ చేస్తూ.. 'ఏజ్ జస్ట్ ఎ నంబర్' అన్న మాటను నిజం చేస్తోంది. తన డ్యాన్స్, ఫిట్‌నెస్‌తో యంగ్ హీరోయిన్లకే పోటీ ఇస్తోంది. సినిమాలు తక్కువే చేసినా.. తన స్పెషల్ సాంగ్స్‌తో మాత్రం బాలీవుడ్‌కు ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. డ్యాన్స్ అనగానే గుర్తొచ్చే పేర్లలో మలైకా ఒకటి. అయితే ఇటీవల ఆమెపై సోషల్ మీడియాలో ట్రోల్స్ ఎక్కువయ్యాయి. డ్యాన్స్ చేయడం మానేయాలి", క్షమాపణలు చెప్పాలి అంటూ కామెంట్స్ చేయడంతో మలైకా స్పందించింది. 'డ్యాన్స్ నా శక్తి. అది నా ఆత్మకు ఆనందం ఇస్తుంది. నేను చేసిన పనికి క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు' అంటూ ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మలైకా అరోరా షాకింగ్ కామెంట్లతో ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. "గత కొద్ది కాలంగా నాపై కొందరు కావాలనే నెగిటివిటీని స్ప్రెడ్ చేస్తున్నారు. కానీ నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలని అంటున్నారో నాకు అర్థం కావడం లేదు. ఆ విషయం నేను క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వచ్చేవే.. కానీ డ్యాన్స్ చేయడమే గొప్ప విషయం అని నేను అనుకుంటా. అదో కళ.. అది నాలో ఉన్నందుకు దానిని నేను గౌరవంతో ఆస్వాదిస్తున్నా. 52 ఏళ్ల వయసులో నేను ఐటెం సాంగ్స్‌లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నా అంటే అది నా అదృష్టంగా భావిస్తున్నా. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నా. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తి వస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు నాలా హుషారుగా ఉంటే దానికి మించిన ఆనందం నాకు మరొకటి లేదు" అని చెప్పుకొచ్చింది.

# ఇప్పటినుంచి అలాంటి రోల్స్ చేయను



స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదర గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'ఇచట వాహనాలు నిలుపరాదు' మూవీతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్‌కి ఎదిగింది. ప్రజెంట్ నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న 'అనగనగా ఒకరాజు' మూవీలో యాక్ట్ చేస్తుంది. మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్ నిర్మిస్తున్నది. అలాగే శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అయితే మూవీ నేడు థియేటర్లలో రిలీజ్ అయింది. ఈ క్రమంలో హీరోయిన్ మీనాక్షి చౌదరి చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ చిన్నది మాట్లాడుతూ.. 'లక్కీ భాస్కర్ చిత్రంలో దుల్కర్ సల్మాన్‌కు భార్యగా నటించినందుకు నాకు ప్రశంసలు లభించాయి. కానీ కొందరు స్నేహితులు నన్ను భయపెట్టారు. కెరీర్ స్టార్టింగ్‌లోనే ఇలా భార్యగా, బిడ్డకు తల్లిగా నటించకపోవడం చాలా మంచిదని చెప్పారు. ఎందుకంటే నువ్వు ఇలాంటి పాత్రలు చేయడం స్టార్ట్ చేస్తే నిన్ను అమ్మ, అక్క పాత్రలకే పరిమితం చేస్తారని అన్నారు. అయితే లక్కీ భాస్కర్ సినిమా కథ నచ్చి తల్లి క్యారెక్టర్ చేశాను. ఇక అటువంటి పాత్రలు వస్తే చేయలేనని చెప్తాను' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.



# మరో బంపర్ ఆఫర్ అందుకున్న రాషా థడానీ


స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ త్వరలో టాలీవుడ్‌లో అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. ఘట్టమనేని వారసుడు జయకృష్ణకు జంటగా ఆమె నటించనున్న తొలి తెలుగు సినిమా 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభమై ఉండగా, విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది. ఇక ఈ సినిమా విడుదలకు ముందే రాషా థడానీకి మరో క్రేజీ ఆఫర్ దక్కింది. బాలీవుడ్‌లో ఆమె కొత్త సినిమాను ప్రకటిస్తూ మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. 'లైకీ లైకా' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అభయ్ వర్మ హీరోగా నటిస్తుండగా, రాషా థడానీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ రొమాంటిక్ డ్రామాను సౌరభ్ గుప్తా దర్శకత్వం వహించనుండగా, ఫాంటమ్ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందుతోంది. షూటింగ్ జూన్ నెలలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇటీవల విడుదలైన 'లైకీ లైకా' ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రేమ, హింస రెండూ కలిసిన కథను సూచించేలా రూపొందించిన ఈ పోస్టర్‌లో హీరో, హీరోయిన్ బూట్లపై రక్తపు మరకలు కనిపిస్తూ ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఇది సాధారణ రొమాంటిక్ కథ కాదని, తీవ్రమైన సంఘర్షణలతో కూడిన కథను ఈ సినిమా చెప్పబోతోందన్న సంకేతాలు ఇస్తోంది. ఈ ఏడాది సమ్మర్ కానుకగా 'లైకీ లైకా' ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. ఒక సినిమా విడుదల కాకముందే మరో భారీ ఆఫర్ దక్కించుకోవడం రాషా థడానీ క్రేజ్‌కు నిదర్శనంగా మారింది.



# నటన నేర్చుకునే వారికి ఇదొక పాఠం

బాలీవుడ్ హీరోయిన్ యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ జంటగా నటించిన సినిమా 'హక్క. కోర్ట్‌రూమ్ డ్రామా చిత్రం, ఇది షా బానో కేసు వంటి నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందించబడింది. ట్రిపుల్ తలాక్ తర్వాత న్యాయం కోసం పోరాడే మహిళ కథను ఇందులో చూపించారు. అయితే విడుదలకు పలు వివాదాల్లో చిక్కుకున్న ఈ సినిమా గత ఏడాది విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. అంతేకాకుండా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ సినీ సెలబ్రిటీల మనసులు గెలుచుకుంటోంది. ఇటీవల ఆలియా భట్ సినిమాపై ప్రశంసలు కురిపించింది. తాజాగా, టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత 'హక్క చిత్రాన్ని చూసి భావోద్వేగానికి గురైనట్లు తెలుపుతూ.. ఎమోషనల్ నోట్ షేర్ చేసింది. "హక్ సినిమా అయిపోయిన వెంటనే ఈ మాటలు రాయాలనిపించింది. ఎందుకంటే ఆ సినిమా నాలో కలిగించిన భావోద్వేగాలను కొంచెం కూడా కోల్పోకూడదని అనుకున్నాను. ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఈ కథ ఎంతో సహజంగా, లోతైన మానవీయ కోణంలో సాగింది. ఎలాంటి పక్షపాతం లేకుండా ఎక్కడా ఎవరినీ తక్కువ చేసి చూపించలేదు. ముఖ్యంగా యమీ గౌతమ్ లాంటి అద్భుతమైన నటి ఈ కథకు ప్రాణం పోశారు. యామీ.. నీ నటన నన్ను మాటల్లో చెప్పలేనంతగా కదిలించింది. ఒకేసారి ప్రేమ, ఆగ్రహం, బలం, నిస్సహాయత, ఆశ.. ఇలా అన్ని భావాలను నేను అనుభవించాను. సినిమా అంటే ఇది. ఎన్నో ఆటుపోటుల మధ్య మనం ఈ వృత్తిని ఎందుకు ఎంచుకున్నామో, ఎందుకు కష్టపడతామో చెప్పడానికి ఇలాంటి సినిమాలే నిదర్శనం.

# సమ్మర్ స్పెషల్‌గా 'నేను రెడీ' రిలీజ్



హీరో హవిష్, దర్శకుడు త్రినాధ రావు నక్కిన కాంబోలో రాబోతున్న ఎంటర్టైనర్ 'నేను రెడీ'. హర్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కొనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవిష్ సరసన కావ్య థపర్ కథనాయికగా నటిస్తోంది. టీజర్‌ను మేకర్స్ మంగళవారం విడుదల చేశారు. ఈ టీజర్ ఒక ఎంటర్టైనింగ్ కథంశాన్ని పరిచయం చేస్తుంది. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసే బాధ్యత గల మధ్యతరగతి ఆంధ్ర యువకుడికి, ఒక మధ్య తరగతి తెలంగాణ అమ్మాయితో నిశ్చితార్థం జరగడం, దానివల్ల కల్చర్, లైఫ్ స్టయిల్ మధ్య హిలేరియస్ కాన్ఫ్లిక్ట్‌కి దారితీయడం ఆసక్తికరంగా ఉంది. త్రినాధ రావు నక్కిన మరోసారి కంప్లీట్ ఎంటర్టైనర్ రూపొందించడంలో తన మార్క్‌ని చూపించారు. అమ్మాయి కుటుంబం మాంసాహారాన్ని అమితంగా ఇష్టపడటం, అబ్బాయి కుటుంబం శాకాహారాన్ని పాటించడం వంటి సహజమైన పరిస్థితుల ద్వారా హాస్యాన్ని పండించారు. హవిష్ బాధ్యత గల మధ్యతరగతి కుర్రాడి పాత్రలో ఒదిగిపోయి, తన స్క్రీన్ ప్రెజెన్స్, అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు. కావ్య థపర్ నిజాం అమ్మాయిగా ఆకట్టుకుంది. వారిద్దరి కెమిస్ట్రీ ఎట్రాక్టీవ్‌గా ఉంది. బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిషోర్, వీటీవీ గణేష్ వంటి హాస్య నటులు ఉండటంతో ఈ చిత్రం నాన్‌స్టాప్ వినోదాన్ని అందిస్తుందని ప్రామిస్ చేస్తుంది. సమ్మర్ స్పెషల్‌గా ఈ సినిమా విడుదల కానుంది.

## శ్రీలక్ష్మి నరసింహా స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, స్వామివారి తన ఇలవేల్పు అని ప్రతి సంవత్సరం స్వామివారిని దర్శించు కుంటానని తెలిపారు.దేశంలో యువత ఎక్కువగా ఉంది తెలంగాణలో చాలామంది యువత పెడదోవన పడుతున్నారు వాళ్ళందర్నీ డాక్టర్లుగా ఇంజనీర్లుగా తీర్చిదిద్దడానికి తాను కృషి చేస్తున్నానని విద్యాసంస్థల ద్వారా ఎంతో మంది మేధావులను వెలికి తీయడం జరుగుతుందని తెలిపారు. ప్రపంచంలోనే యాదాద్రి పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని అన్నారు.

## గ్రామంలో నిఘా వ్యవస్థ బలోపేతం దిశగా సర్పంచ్ సౌమ్య కృషి అభినందనీయం

- నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణకు చర్యలు
- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్ ప్రశంస



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని గ్రామం 8వ వార్డు పరిధిలో, స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో సీసీ కెమెరాను (నిఘా నేత్రం)ఏర్పాటు చేశారు. గ్రామ భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా చేపట్టిన ఈ చర్యకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటివరకు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో భద్రతా చర్యలను ముందుండి అమలు చేస్తున్న సర్పంచ్ పెంచాల సౌమ్య -- మహేష్ దంపతులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగాసబ్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ మాట్లాడుతూ,"గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు, అనుమానాస్పద ఘటనలపై తక్షణ చర్యలు తీసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా పాఠశాల పరిసరాల్లో కెమెరాలు ఉండడం వల్ల పిల్లల భద్రత మరింత పెరుగుతుంది. గ్రామసర్పంచ్ ఆధ్వర్యంలో పాలకవర్గం చూపుతున్న చొరవ అభినందనీయం" అని అన్నారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు ప్రజల భద్రతే లక్ష్యంగా ఇలాంటి చర్యలు కొనసాగిస్తామని సర్పంచ్ పెంచాల సౌమ్య తెలిపారు.

## యాదగిరిగుట్టను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ రేణుక యారా



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారిని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ రేణుక యారా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వేద ఆశీర్వచనము అనంత్రం ఆలయ డీఈవో భాస్కర్ లడ్డు ప్రసాదం అందచేశారు. వారు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మొదటగా వారికి ఆలయం సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక వేద ఆశీర్వాదాలు అందచేసిన ఆలయ అర్చకులు,ప్రధాన ఆలయంలో స్వయంభూ మూర్తుల దర్శనం అనశీత్రం సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు.దర్శనము తదుపరి కృష్ణ శిల ఆలయాన్ని సందర్శించారు.

## యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్
- గ్రామీణ క్రీడా ప్రతిభకు వేదికగా బూరుగుపల్లి ప్రీమియర్ లీగ్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం నిర్వహించిన బూరుగుపల్లి ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) సీజన్--5 క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన జట్లకు బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ రమాకాంత్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ పెరుగుతాయి. పండుగలను క్రీడలతో కలిపి జరుపుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సౌమ్య - మహేష్, ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య,వార్డు సభ్యులు, ఆర్గనైజర్స్,యువకులు, క్రీడాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అత్యంత పుణ్యప్రధం ఉత్తరాయణ పుణ్యకాలం



సంక్రాంతి అనగా నూతన క్రాంతి. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు. ఈ సంక్రమణమే సంక్రాంతిగా మారింది. పంచాంగానుసారం మనకు పన్నెండు రాశులు ఉన్నాయి. ఏ పన్నెండు రాశులలోకి సూర్యుడు ప్రవేశించే క్రమంలో మనకు పన్నెండు సంక్రాంతులు వస్తాయి. సూర్య సంక్రమణం జరిగే సమయంలో సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ సంక్రాంతిగా గుర్తిస్తారు. ఇలా ప్రతి మాసం ఒక సంక్రాంతి ఉంటుంది. సౌరమాన కాలెండరు ప్రకారం ప్రతినెల ఒక సంక్రమణ జరుగుతుంది. సూర్యుడు ధనూరాశి నుండి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అందుకే దీనిని మకర సంక్రాంతి అని అంటారు. ముఖ్యంగా ఈ పండుగను తెలుగు రాష్ట్రాలలో పెద్ద పండుగగా జరుపుకుంటారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాలగవ రోజు ముక్కనుమగా కూడా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటి రోజు భోగిమంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గోపూజలతో అలాగే మాంస ప్రియులకు మంచి కూరలతో, మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా జరుపుకుంటారు.

### ఉత్తరాయణం- దక్షిణాయనం

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణము. మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభము అవుతుంది. ఆ తరువాత కుంభ, మీన, మేష,వృషభ, మిథున రాశులలో కొనసాగినంత కాలము ఉత్తరాయణము. శారీరక పరిశ్రమకు, పూజలకు, సాధనలకు, కృషికి అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము ఉత్తరాయణము.కర్కాటక రాశిలోకి సూర్యుడు ప్రవేశించిన దగ్గర నుండి మొదలై, ఆ తరువాత సింహ, కన్య, తుల, వృశ్చికం, ధనూ రాశులలో కొనసాగినంత కాలము దక్షిణాయణము. మానసికమైన అర్చనకు, ధ్యానానికీ, యోగానికీ, దీక్షలకు, బ్రహ్మచర్యానికి, నియమ నిష్టలకు అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము దక్షిణాయణము. పన్నెండు నెలల సంవత్సర కాలములో ఆరు నెలల దక్షిణాయణము దేవతలకు ఒక రాత్రి, ఆరు నెలల ఉత్తరాయణము దేవతలకు ఒక పగలు. కనుక దేవతలు మేలుకునే కాలము ఉత్తరాయణ పుణ్య కాలము. కనుకనే ఉత్తరాయణము వరకూ ఎదురు చూసి ఉత్తరాయణము ప్రవేశించిన తర్వాత భీష్ముడు తనువును చాలించాడు "సంక్రాంతి" లేదా "సంక్రమణం" అంటే చేరుట అని అర్థం. జయసింహ కల్పద్రుమం అనే గ్రంథంలో సంక్రాంతిని

**"తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమణేషు సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తరః రాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః"**

మేషంతో మొదలై 12 రాశులలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశిలోనికి ప్రవేశించడమే సంక్రాంతి. సూర్యుని చలనంలో (రథయాత్రలో) ఘట్టాలు నాలుగు. అవి మేష, తుల, కటక, మకర సంక్రమణాలు. వీటిలో మకర సంక్రమణాన్ని "సంక్రాంతి పండుగ"గా వ్యవహరిస్తారు. మార్గశిరం పూర్తి కాగానే ఉత్తరాయణం మొదలవుతుంది.
సూర్యుడి చుట్టూ భూమి పరిభ్రమించే మార్పు క్రమంలో తన చుట్టూ తాను కూడా తిరుగుతుంది. అందువలన సూర్యుడు ఆరు నెలలు ఉత్తరం వైపు ఆరు నెలలు దక్షిణం వైపు కనిపిస్తాడు. ఇలా ఉత్తరం వైపు కనిపించే క్రమమే ఉత్తరాయణం అంటారు. దక్షిణం వైపు కనిపించే క్రమం దక్షిణాయణం. మనకు ఒక సంవత్సరం కాలము అయితే దేవుళ్ళకు ఒక రోజు. అయితే ఒక రోజులో పగలు అనేది ఉత్తరాయణం. రాత్రి అనేది దక్షిణాయణం. ఉత్తరాయణం మనకు అత్యంత ముఖ్యం. ఈ రోజు కోసమే భీష్ముడు ఎదురుచూసి ఉత్తరాయణ పుణ్య ఘడియలలోనే పరమపదించారు.

### దానాదులు..

ఉత్తరాయణ పుణ్యకాలమైన సంక్రాంతి రోజున చేయు ఏ దానమైన శ్రేష్టమైనదని చెప్పబడింది. ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, కాయగూరలు, దుంపలు, నువ్వులు, చెరకు మొదలయినవి దానం చేస్తారు. ఇవి కాక ఈ కాలమందు చేయు గోదానం వలన స్వర్గ వాసం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



రవికుమార్ సంతోజు

# సంక్రాంతి సంబరాల్లో ప్రధాన ఆకర్షణ పతంగులదే







**సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్)** సంక్రాంతి పండగ సంబరాల్లో ప్రధాన ఆకర్షణ పతంగులు ఎగరవేయడంపై. పిల్లలు, పెద్దలు, వృద్ధులనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తు సందడి చేస్తారు. శతాబ్దాల చరిత్ర ఉన్న పతంగుల పండుగ నేడు అంతర్జాతీయ ఖ్యాతిని సంతరించుకుని ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుంది. పతంగులు ఎగరవేయడంలో పిల్లలు కేరింతలతో అత్యంత ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు. పిల్లలోని ఉత్సాహాన్ని పెంచేందించే క్రమంలో భాగంగా సుల్తాన్ బజార్ పరిధిలోని కృపారాంబాగ్ ప్రాంతంలో రూపేష్ ఆధ్వర్యంలో పతంగుల తయారీదారుడు జయకరణ్ చిన్నారులకు ఉచితంగా పతంగులు, ధారం, చర్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూపేష్ మాట్లాడుతూ పతంగుల ఎగరవేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని, ఈ వేడుకలు కుతుబ్ షాహీ పాలన నుండి నిజాం కాలం వరకు కొనసాగి నేడు అంతర్జాతీయ ఫెస్టివల్ గా మారిందని, సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలు, పతంగుల చరిత్రను భావితరాలకు అందించే బాధ్యత మనపై ఉందని అన్నారు. పతంగుల తయారీ లో అత్యంత అనుభవజ్ఞుడైన జయకరణ్ మాట్లాడుతూ సంక్రాంతి పండగ అంటేనే పతంగుల సందడిని తెలిపారు. పతంగులు ఎగరవేయడంతో పిల్లలో నూతనోత్తేజం వస్తుందని అన్నారు. ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్న పతంగుల పండగ ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఒక కొత్త ఒరవడితో కొత్త పుంతలు తొక్కుతు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుందని అన్నారు.ం

## ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి 13 మంది ల్యాబ్ టెక్నీషియన్ల నియామకం

- డైరెక్టర్ డాక్టర్. జోసెఫ్ బెంజ్ మన్



**నాంపల్లి (ప్రశ్న న్యూస్)** వైద్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్లు పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందని యంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జోసెఫ్ బెంజుమన్ అన్నారు. కొత్తగా ఎంపికైన 1257 మంది గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్లకు ఉస్మానియా మెడికల్ కళాశాలలో సోమవారం నాడు నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. దీనిలో భాగంగా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి కి 13 మంది ల్యాబ్ టెక్నీషియన్లను కేటాయించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జోసెఫ్ మాట్లాడుతూ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి 13 మంది ల్యాబ్ టెక్నీషియన్ లను కేటాయించడం హర్షణీయమని, దీంతో రోగులకు అవసరమైన వైద్య సేవలను మరింత పటిష్టవంతంగా అందించే అవకాశం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని తెలుపుతూ ఎంఎన్‌జే ఆస్పత్రి కి కేటాయించి నియామక ఉత్తర్వులు అందుకున్న ల్యాబ్ టెక్నీషియన్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పాండు నాయక్, ఆఫీస్ సూపరింటెండెంట్ సునీతా, ల్యాబ్ టెక్నీషియన్లు కె. నరేందర్ రెడ్డి, సి. నాగరాజు, రమేశ్, నవీన్, లక్ష్మినారాయణ, సత్యం, విక్కి, సౌజన్యా రెడ్డి, వెంకట నర్సమ్మ, స్వప్న, పద్మావతి, వెంకట హరిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతిని చాటే పండుగ " సంక్రాంతి"

- యువత సమాజాభివృద్ధికి తోడ్పడాలి
- చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు "సంక్రాంతి" శుభాకాంక్షలు
- ప్రముఖ సామాజిక వేత్త, టీఎల్ యువసేన అధినేత : తూడి లచ్చన్న



**గంగాధర (ప్రశ్న న్యూస్)** ప్రముఖ సామాజిక వేత్త,టీఎల్ యువసేన అధినేత తూడి లచ్చన్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"సంక్రాంతి పండుగ రైతు సంస్కృతి, కుటుంబ అనుబంధాలు, ఐక్యతను చాటిచెప్పే గొప్ప పండుగ. ఈ పండుగ సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నాను. చొప్పదండి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని కోరుకుంటున్నాను. యువత కష్టపడి పనిచేసి సమాజాభివృద్ధికి తోడ్పడాలి" అని అన్నారు.అంతేకాకుండా రైతుల కృషికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.

## లాలాపేట రహదారి విస్తరణ పేరిట

# అక్రమ వసూళ్లు

- పగిలిన డ్రైనేజ్ పైపుల మరమ్మత్తుల పేరుతో ప్రజలపై కాంట్రాక్టర్ దోపిడీ
- ఇంజనీరింగ్, జలమండలి అధికారుల కనుసైగల్లో దోపిడీకి తెరనా.?
- ప్రజలను దోచుకోవడమే కాంట్రాక్టర్ల, అధికారుల లక్ష్యమా.?
- ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు



**తార్నాక (ప్రశ్న న్యూస్)** కేవలం సంవత్సరంలోపు జరగాల్సిన రోడ్డు విస్తరణ పనులు దాదాపు పది సంవత్సరాలు దాటిపోయిన ఇంకా నత్తి నడకన సాగుతున్నాయి అంటే స్థానిక ఎమ్మెల్యే వైపల్యమని స్థానికులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఏమాత్రం లేదనేది ప్రస్తుతం లాలాపేట రోడ్డు విస్తరణ పనులు చూస్తుంటే అర్థమవుతుంది కిలోమీటర్ కూడా పూర్తిస్థాయిలో లేని రోడ్డు విస్తరణ పనులు చేయడానికి దశాబ్దం దాటిపోయింది అంటే ప్రజల సమస్యలపై అధికారులకు పాలకులకు ఎంత చిత్తశుద్ధి ఉందో స్థానిక ఓటర్లకే తెలియాలి.

లాలాపేట రహదారి విస్తరణ పనులు ప్రజలకు మేలు చేయాల్సిన చోట కొత్త సమస్యలకు దారితీస్తున్నాయి. రహదారి విస్తరణ సమయంలో డ్రైనేజ్, తాగునీరు పైపులైను పగిలిపోవడంతో పరిసర కాలనీల్లో మురుగు నీరు రోడ్లపైకి ప్రవహిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అయితే ఈ సమస్యను పరిష్కరించాల్సిన కాంట్రాక్టర్ బాధ్యత తీసుకుని మరమ్మత్తులు చేయాల్సిన బదులు, ప్రజల వద్ద నుండి అక్రమ వసూళ్లకు పాల్పడటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

### పైపు పగిలింది డబ్బులు ఇస్తేనే చేస్తాం..

"మీ ఇంటి ముందు పైపు పగిలింది, డబ్బులు ఇస్తేనే మరమ్మత్తులు చేస్తాం" అంటూ ఇంటి యజమానులను కాంట్రాక్టర్, అధికారులు కలిసి బెదిరింపులకు గురిచేస్తున్నారనే స్థానికుల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇది కేవలం అనైతిక చర్య మాత్రమే కాకుండా, ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం కచ్చితంగా అవినీతి అని స్థానికులు మండిపడుతున్నారు. రహదారి విస్తరణ వల్ల నష్టపోయింది ప్రజలే, పైగా అదే పనికి మళ్లీ డబ్బులు చెల్లించాల్సి రావడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇకపోతే ఈ అక్రమ వసూళ్లపై జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు, జలమండలి అధికారులు కళ్లుమూసుకుని ఉండటం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వల్లే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.తక్షణమేపగిలిన డ్రైనేజ్ పైపులను ప్రభుత్వ ఖర్చుతో మరమ్మత్తులు చేయాలి,అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి,బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.లాలాపేట రహదారిపై జరుగుతున్న ఈ ఘటన రహదారి విస్తరణ పనుల వెనుక నడుస్తున్న అవినీతికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. ఉన్నత అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే, ప్రజా ఆగ్రహం మరింత ఉధృతమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

### డిప్యూటీ మేయర్, ఎమ్మెల్యే స్పందించేనా.?

సికింద్రాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ల నిర్లక్ష్యం అడుగడుగునా ఉందని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. సాక్షాత్ డిప్యూటీ మేయర్ డివిజన్లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులలో కాంట్రాక్టర్లు, అధికారులు ప్రజల దగ్గర దోపిడీకి తెగబడ్డ స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంద. ఎన్నికల ముందు అన్నిటికీ మేము ఉంటామని కలిబొల్లి కబుర్లు చెప్పే నాయకులు ఇప్పుడు ఏమైనారంటు ప్రజలు నిలదీస్తున్నారు. కేవలం ప్రారంభోత్సవాలప్పుడు శిలాఫలకాలకు కొబ్బరికాయలు కొట్టడం తప్ప పనులు ఎలా జరుగుతున్నాయి.? పనుల్లో నాణ్యత ఎంత.? నాణ్యతతో పనులు చేస్తున్నారా.? పూర్తిస్థాయిలో ఇంకా ఎందుకు పనులు జరగడం లేదు.? ప్రజలను కాంట్రాక్టర్లు ఇబ్బంది పెడుతున్నారా.? వంటి తదితర విషయాలను స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి కానీ ఇలా ఏనాడు చేసిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రజా ప్రతినిధులకు ఇంత నిర్లక్ష్యం ఉంటే ప్రజల సమస్యలు ఎలా తీరతాయో వారికే తెలియాలి.

# 1000 రూపాయలకు మటన్

- సామాన్యుడి ప్లేట్ నుంచి మాంసం మాయం
- ఇష్టారాజ్యంగా మటన్ ధరలు పెంచుతున్నది ఎవరు.?
- మాంసం విక్రయాలపై ప్రభుత్వానికి అజమాయిషి లేదా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు మటన్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కిలో మటన్ ధర వెయ్యి రూపాయలకు చేరడం ప్రజల సహనానికి తీవ్ర పరీక్షగా మారింది. సామాన్యుడి వంటింట్లో మాంసం వండుకోవడం ఇప్పుడు కలగానే మారిందని ప్రజలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ధరల నియంత్రణ అన్న మాటే కనబడడం లేదని ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోజువారీ కూలీలు, మధ్యతరగతి ఉద్యోగులు మటన్ వైపు చూడలేని పరిస్థితి నెలకొంది. "మా కష్టార్జిత సంపాదనతో కూరగాయలే కొనలేకపోతున్నాం, ఇక 1000 రూపాయల మటన్ ఎలా కొనాలి.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పండుగలు, పెళ్లిళ్లు వస్తే చాలు వ్యాపారులు ధరలు తమకు ఇష్టం వచ్చినట్లు పెంచి ప్రజలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తమవుతోంది. మటన్ ధరలపై ప్రభుత్వానికి అజమాయిషి లేదా వాటిని ఎందుకు నియంత్రించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మేకల కొరత, మేత ఖర్చులు, రవాణా వ్యయం అంటూ వ్యాపారులు ఏవేవో కారణాలు చెబుతున్నా, అసలు సమస్య మధ్యవర్తుల దోపిడీ, అధికారుల లంచాల దాహం తో ధరలు పెరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ధరలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కళ్లుమూసుకుని కూర్చున్నారని, మటన్ మాఫియాతో చేతులు కలిపారని విమర్శిస్తున్నారు. నియంత్రణ కమిటీలు, తనిఖీలు అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రేవంత్ రెడ్డిప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మటన్ ధరలకు గరిష్ఠ పరిమితి నిర్ణయించకపోతే ప్రజా ఆగ్రహం మరింత ఉధృతమవుతుందని హెచ్చరిస్తున్నారు. ఓట్లు అడిగేటప్పుడు ప్రజలే గుర్తొస్తారు, ధరలు పెరిగితే ప్రజల బాధ ఎవరికీ పట్టదా.? అంటూ సామాన్యులు ఘాటు ప్రశ్నలు సంధిస్తున్నారు.మటన్ ధరల పెరుగుదల ఒక్క వంటింటి సమస్య మాత్రమే కాదు, ఇది పాలకుల వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని మటన్ ధరలపై చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజా అసంతృప్తి రోడ్లపైకి వచ్చే పరిస్థితి తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీనిపై రేవంత్ రెడ్డి సర్కార్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# పత్రికలలో అవినీతి అక్రమాలు రాసేది జర్నలిస్ట్

## దానిపై ఫిర్యాదు చేసి సెటిల్మెంట్ చేసుకునేది మరొకడు

- పత్రికా కథనాలపై ఫిర్యాదులు చేసి సెటిల్మెంట్లకు పాల్పడుతున్న కేటుగాళ్లు
- ఫిర్యాదులు చేసి సంపాదించడమే వృత్తి ధర్మంగా మలుచుకున్న దుర్మార్గులు
- అక్రమ వసూళ్లలో రాజకీయ నాయకులు, నకిలీ రిపోర్టర్లు, న్యాయవాదులు సైతం ఉన్నట్లు ఆరోపణలు
- పత్రికలో వచ్చిన అవినీతి అక్రమాలపై ఆర్టిఐ పెట్టాలి ఫిర్యాదులు చేసేది సెటిల్మెంట్ కోసమే నా.?
- సంఘాల, అసోసియేషన్ ముసుగులో ఫిర్యాదులు వసూళ్ల కోసమే నా.?





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఒక రిపోర్టర్ కష్టపడి ఆధారాలు సేకరించి అధికారుల చుట్టూ తిరిగి వివరాలు తీసుకొని అవినీతి అక్రమాలు ప్రజలలోకి తీసుకెళ్లడానికి వార్తలు రాస్తే దానిని ఆసరాగా చేసుకుని కొంతమంది కేటుగాళ్లు అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు.పత్రికలలో వచ్చిన వార్తా కథనాల పేరుతో ఫిర్యాదులు చేసి సెటిల్‌మెంట్‌ల దందా.? ప్రారంభించారు. వార్తలు రాసింది ఒక రిపోర్టర్ అయితే దానిని అడ్డం పెట్టుకొని అక్రమ సంపాదన చేసేవాళ్లు భారీగా పెరిగినారు. సమాజంలో అవినీతి, అక్రమాలుపత్రికల్లో కథనాలు రాయడం ఒక బాధ్యతాయుతమైన వృత్తి అలా రాయడం కత్తి మీద సాము లాంటి పని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిజం ప్రధాన లక్ష్యం. కానీ ఇటీవలి కాలంలో కొన్ని చోట్ల జరుగుతున్న పరిణామాలు ఈ వృత్తి పవిత్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.కొన్ని సందర్భాల్లో పేపర్లో కథనాలు రాసేది ఒక వ్యక్తి కాగా, అదే కథనాల ఆధారంగా అధికారులకు ఫిర్యాదులు చేసి, చివరకు సంబంధిత వ్యక్తులతో సెటిల్‌మెంట్ చేసుకునేది మరో వ్యక్తి అన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ ప్రక్రియ ఒక క్రమబద్ధమైన వ్యవస్థలా నడుస్తోందని పలువురు పేర్కొంటున్నారు.మొదటిగా పత్రికలో తీవ్ర ఆరోపణలతో కూడిన కథనం ప్రచురితం కావడం, ఆ వెంటనే అదే విషయంపై అధికారులకు ఫిర్యాదు చేయడం, చివరికి సమస్య పరిష్కారం పేరుతో ఆర్థిక లావాదేవీలు జరగడం వంటి ఘటనలు ఇటీవల చాలా పెరిగాయి అవినీతి అక్రమాలు వెలుగులోకి తీసుకువచ్చిన రిపోర్టర్లు ఎక్కడ పోతున్నారు కానీ ఆ కథనాలను అడ్డుపెట్టుకొని వసూల్ దండ చేసే వాళ్ళు ఎక్కువైనారని దీనితో ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయి. దీనివల్ల నిజమైన జర్నలిస్టుల ప్రతిష్ఠకు భంగం కలుగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇలాంటి వ్యవహారాలు కొనసాగితే పత్రికలపై, వార్తలపై ప్రజల నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది. జర్నలిజం అనేది ప్రజా సేవగా ఉండాలి కానీ సెటిల్‌మెంట్‌ల మార్గంగా మారకూడదని మేధావులు సూచిస్తున్నారు.అధికారులు కూడా ఈ తరహా ఫిర్యాదులను సవివరంగా పరిశీలించి, నిజానిజాలను నిర్ధారించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అయితే కొంతమంది అధికారులు సిబ్బంది ఫిర్యాదుదారులతో చేతులు కలిపి పరోక్షంగా సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే సమస్య పరిష్కరించుకోవాలని అక్రమ నిర్మాణదారులపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది అధికారులు వత్తిడి తీసుకురావడం చూస్తుంటే అధికారులకు సిబ్బందికి వాటాలు ఉన్నాయా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే పత్రికా యాజమాన్యాలు, జర్నలిస్టు సంఘాలు కూడా ఇలాంటి అనైతిక చర్యలపై కఠినంగా వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు.జర్నలిజం విశ్వసనీయత నిలవాలంటే, వార్త రాయడంలో పారదర్శకత, బాధ్యత, నైతిక విలువలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని ఈ పరిణామాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి. పత్రికల వార్తలు రాసిన రిపోర్టర్ల కంటే దానిని అడ్డం పెట్టుకొని సంపాదించే రాజకీయ నాయకులు, సంఘాల నేతలు, ఇతర వ్యక్తులు ఎక్కువైనారు దానికి కారణం అధికారులే అన్న ఆరోపణలు ఉన్నాయి. మరి దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## కూకట్‌పల్లి నల్లచెరువులో

# ఘనంగా కైట్ ఫెస్టివల్

- పతంగి ఎగరేసి వేడుకలు ప్రారంభించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- కబ్జాల నుంచి చెరువును విడిపించి 30 ఎకరాలకు విస్తరించామని వెల్లడి
- నగరంలో మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని ప్రకటన
- హైడ్రా, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన స్థానిక ప్రజలు



**కూకట్‌పల్లి (ప్రశ్న న్యూస్)** కూకట్‌పల్లిలోని నల్లచెరువు వద్ద బుధవారం పండుగ వాతావరణం నెలకొంది. ఒకప్పుడు మురికి, దుర్గంధంతో నిండిన ఈ ప్రాంతం ఇప్పుడు పతంగుల పండుగతో సందడిగా మారింది. స్థానికుల ఆహ్వానం మేరకు ఈ కైట్ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, స్వయంగా పతంగి ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. పిల్లలు, యువకులతో కలిసిపోయి ఉత్సాహంగా పతంగిని గాలిలోకి వదిలిన ఆయన, తన బాల్య, యవ్వన స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, "2024 సెప్టెంబరులో చెరువు విస్తరణ పనులు ప్రారంభించినప్పుడు ఇక్కడ తీవ్ర నిరసనలు ఎదుర్కొన్నాం. కానీ ఈ రోజు ఇక్కడి ప్రజల ముఖాల్లో ఆనందం, పండుగ వాతావరణం చూడటం ఎంతో సంతోషంగా ఉంది" అని అన్నారు. కబ్జాల కారణంగా 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్లచెరువును, పూడికతీత పనులు చేపట్టి ఏకంగా 30 ఎకరాలకు విస్తరించామని తెలిపారు. దాదాపు 10 అడుగుల లోతు పేరుకుపోయిన పూడికను తొలగించి, చెరువు లోతు పెంచడం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని వివరించారు. "కేవలం పైపై మెరుగులు దిద్దడం కాదు, చెరువుల అభివృద్ధి అంటే ఎలా ఉండాలో చేసి చూపించాం. ఇప్పుడు ఈ చెరువును చూస్తుంటే ఎంతో ఆహ్లాదంగా ఉంది. 5 కిలోమీటర్ల దూరం నుంచి కూడా ప్రజలు ఇక్కడికి వాకింగ్ కోసం వస్తున్నారని తెలిసి చాలా ఆనందించాను" అని అన్నారు.త్వరలోనే ఈ చెరువు వద్ద షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్, యోగా కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్ వంటి క్రీడా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని, వీటన్నింటినీ ప్రజలు ఉచితంగా వినియోగించుకోవచ్చని రంగనాథ్ హామీ ఇచ్చారు. హైడ్రా ఆధ్వర్యంలో మొదటి విడతలో 6 చెరువుల అభివృద్ధి చేపట్టగా, ఇప్పటికే బతుకమ్మకుంటను ప్రారంభించామని, మరో 3 చెరువులను ఫిబ్రవరిలోగా ప్రారంభిస్తామని చెప్పారు. వీటికి అదనంగా మరో 14 చెరువులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, త్వరలోనే ఆ పనులు కూడా మొదలుపెడతామని ప్రకటించారు. నగరంలో వంద చెరువులను అభివృద్ధి చేస్తే వరదలను నియంత్రించవచ్చని, భూగర్భ జలాలు పెరిగి మంచి నీరు అందుబాటులోకి వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. చెరువు అభివృద్ధి పట్ల స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. "చెరువును ఈ స్థాయిలో అభివృద్ధి చేస్తారని మేము కలలో కూడా ఊహించలేదు. దుర్గంధభరిత వాతావరణాన్ని తొలగించి ఆహ్లాదాన్ని నింపిన ప్రభుత్వానికి, హైడ్రాకు మా కృతజ్ఞతలు" అని వారు తెలిపారు. చిన్నారులందరూ కమిషనర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పగా, ఆయన వారికి స్వీట్స్ పంచిపెట్టి ఆనందాన్ని పంచుకున్నారు.

## కేసీఆర్‌ను విమర్శించడానికి

# మేం అవసరం లేదు

### ఆమె చాలు: కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పులమయం చేశారని ఆరోపణ
- కేసీఆర్ చేసిన అప్పులను తీరుస్తున్నామన్న మంత్రి
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శించేందుకు తాము అవసరం లేదని, ఆయన కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరిపోతారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే, వాటిని తమ ప్రభుత్వం తీర్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. అప్పులు తీరుస్తూనే రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ వల్ల పాలమూరుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉండగా, రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి మోసాలు చేయాలని చూస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు. కేసీఆర్ మాత్రం ఏదో ఒకరోజు మాత్రమే పనుల కోసం సమయం కేటాయించారని విమర్శించారు. అందుకే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. వివిధ పథకాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. మరో ఇరవై రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లేని పార్టీలకు ఓటు వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అన్నారు. పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలిచామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెబుతున్నారని, పార్టీ గుర్తుతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని ఆయన సవాల్ విసిరారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588